ప్రజాశక్తి

గురువారం 23 నవంబర్ 2023 | 8 పేజీలు

ఎన్‌టిఆర్ | కృష్ణా





ప్రతిపాదనలకే పరిమితం



- గుణదల వంతెనకు మోక్షమెప్పుడో?
- రూ.36 కోట్ల వ్యయంతో 2009లో శంకుస్థాపన
- తాజా అంచనా వ్యయం రూ.62 కోట్లు
- నిధులు మంజూరులో ప్రభుత్వ నిర్లక్ష్యం

ప్రజాశక్తి - విజయవాడ ప్రతినిధి

విజయవాడలో సుదీర్ఘకాలం అపరిష్కృతంగా ఉన్న గుణదల ఫ్లైఓవర్‌కు మోక్షం ఎప్పుడనేది నేటికీ ప్రశ్నార్థకంగా మారింది. ప్రభుత్వాలు మారుతున్నాయి... ముఖ్యమంత్రులు మారుతున్నారు... గుణదల వంతెనె మాత్రం పూర్తి కావడం లేదు. దీంతో ప్రజలు, వాహనదారులకు కష్టాలు తప్పడం లేదు. రైవస్, ఏలూరు, బుడమేరు కాలువల వంతెనలు, రైల్వే క్రాసింగ్‌లు దాటుకొని ఏలూరు రోడ్డుకు చేరుకోవాల్సిన దుస్థితి నెలకొంది.

14 ఏళ్ల క్రితం...

ఉమ్మడి రాష్ట్రంలో దీని ప్రస్తావన తెరపైకి వచ్చింది. నాటి కాంగ్రెస్ ప్రభుత్వంలో ఈ నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. గుణదల నుంచి నున్న వరకు 1.2 కిలోమీటర్ల పొడవున ఫ్లైఓవర్‌ను నిర్మించాలని నిర్ణయించారు. 2009 ఫిబ్రవరి 19న అప్పటి కృష్ణాజిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నేటి రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు దీనికి శంకుస్థాపన చేశారు. రూ.36 కోట్ల అంచనా వ్యయంతో దీని పనులు ప్రారంభించారు. 2015 జనవరి నాటికి పూర్తి చేయాలని నిర్ణయించారు. హైదరాబాద్‌కు చెందిన ఆర్‌ఎస్వీ కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ బిడ్‌ను దక్కించుకుంది. రూ.5.49 కోట్లతో 4 పిల్లర్లు, హేమర్ హెడ్ బ్లాక్ పనులు, రూ.1.70 కోట్లతో సివిల్ వర్కులు, రూ.80 లక్షలతో యుటిలిటీ షిఫ్టింగ్ పనులు, రూ.2.01 కోట్లతో భూ సేకరణ కూడా చేపట్టారు. రూ.98 లక్షలను మొబలైజేషన్ అడ్వాన్స్ కింద చెల్లింపులు చేశారు. 2010లో పనులు నిలచిపోవడంతో కథ మొదటికి వచ్చింది.

రాజకీయ అజెండాగా

2010 తర్వాత దీనిని ప్రభుత్వాలు పట్టించుకోలేదు. రాష్ట్ర విభజన అనంతరం ఇది రాజకీయ అజెండాగా మారిపోయింది. 2014లో అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం నిర్లక్ష్యం వహించింది. తాము అధికారంలోకి వస్తే గుణదల ఫ్లైఓవర్‌ను పూర్తి చేస్తామని వైసిపి హామీ ఇచ్చింది. కానీ పనులు చేపట్ట లేదు. దీంతో వ్యతిరేకత రావడంతో 2021 మార్చిలో మునిసిపల్ ఎన్నికల నేపథ్యంలో లబ్ధి పొందేందుకు దీనిని తెరపైకి తెచ్చింది. గుణదల ఫ్లైఓవర్‌కు ప్రతిబంధకంగా మారిన భూ సేకరణ, యుటిలిటీస్ సమస్యలను పరిష్కరించేందుకు రూ.22.81 కోట్లను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తర్వాత గాలికి వదిలేసింది. నాలుగున్నర సంవత్సరాలు గడుస్తున్నా నేటికి భూసేకరణ ప్రక్రియ కొలిక్కి రాలేదు. ఏలూరు వైపు 27 సెంట్లు, నున్న వైపు మరో 32 సెంట్లను సేకరించాల్సి ఉన్నా ఇంత వరకు పూర్తి కాలేదు. ప్రభుత్వ స్థలాల్లో కట్టిన 107 ఇళ్లను తొలగించి, బాధితులకు పునరావాసం కల్పించడం వంటి చర్యలు కూడా చేపట్టలేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

62 కోట్లతో రివైజ్డ్ ఎస్టిమేషన్స్

ఇప్పటి వరకు మూడు సార్లు అంచనా వ్యయాలతో ప్రతిపాదనలు రూపొందించారు. తొలుత రూ.36 కోట్లు అంచనా వ్యయంతో పూర్తి చేయాలని నిర్ణయించారు. తర్వాత 2021లో రూ.52 కోట్లు అవుతుందని మరో సారి ఎస్టిమేషన్స్ వేశారు. ప్రస్తుతం ఉన్న ధరల ప్రకారం రూ.62 కోట్లు (మిగతా 6లో)

పకడ్బందీగా ధాన్యాన్ని కొనాలి

సిపిఎం కృష్ణాజిల్లా కార్యదర్శి వై.నరసింహారావు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

కృష్ణాజిల్లాలోని పలు మండలాల పరిధిలో వరి కోతలు ప్రారంభమయ్యాయని, ధాన్యం కొనుగోళ్లకు అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేసి రైతులను ఆదుకోవాలని సిపిఎం కృష్ణాజిల్లా కార్యదర్శి వై.నరసింహారావు ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. వరుస తుపాను హెచ్చరికతో ఆరుగాలం కష్టపడి, వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి పండించిన ధాన్యాన్ని దక్కించుకోవడానికి రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. జిల్లాలోని 317 రైతు భరోసా కేంద్రాల్లో నవంబర్ ఒకటి నుండే ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నామని అధికారులు ఆర్భాటంగా ప్రకటనలు చేస్తున్నారు తప్ప ఇప్పటికీ జిల్లాలో ఎక్కువ చోట్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించలేదని తెలిపారు. గతేడాది ఖరీఫ్ ధాన్యం తాలూకు రవాణా, కాటా ఛార్జీలతో పాటు ధాన్యం డబ్బులు అనేక మందికి నేటికీ అందలేదని పేర్కొన్నారు. ఆర్‌బికెల్లోనే నాణ్యతను పరిశీలించి ధర నిర్ణయిస్తామని చెప్పినా ఆచరణలో మిల్లర్లు, దళారులకు పంటను తక్కువ ధరకు అమ్మాల్సి వచ్చిందని తెలిపారు. సంచులు అందుబాటులో ఉంచలేదని, సర్వర్ పని చేయలేదని చెప్పి ఆఫ్‌లైన్లో ధాన్యం కొనుగోలు చేసి రైతుల్ని ముప్పతిప్పలు పెట్టారని తెలిపారు. ఎకరానికి ఇన్నే కొంటామని పరిమితి విధించి ఇబ్బంది పెట్టారని గుర్తు చేశారు. గతేడాది అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఈ ఏడాదైనా పకడ్బందీగా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అన్ని ఆర్‌బికెల్లో రైతులకు అవసరమైన యంత్ర పరికరాలు, సిబ్బందిని అందుబాటులో ఉంచాలని, ధాన్యం డబ్బులతో పాటు, రవాణా, కాటా ఛార్జీలు వారం రోజుల్లోనే చెల్లించాలని చర్యలు తీసుకోవాలని నరసింహారావు కోరారు.




కేతనకొండలో రోడ్డుప్రమాదం

ఇద్దరు మృతి

ఐదుగురికి గాయాలు

వార్త మెయిన్‌లో



విఎన్‌పురంలో ఎండిన మిర్చి పంట

కష్టాల్లో మిరప రైతు

తెగుళ్లతో ఎండిపోతున్న పంట

ప్రజాశక్తి-గన్నవరం: గన్నవరం మండలంలో మిరప పంటకు తెగుళ్లు ఆశించడంతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. తెగుళ్ల బారిన పడిన పంట పలు చోట్ల ఎండిపోతోంది. మండల పరిధిలో మూడు వేల ఎకరాల్లో వివిధ రకాల మిరప సాగులో ఉంది. వెంకట నరసింహాపురం, పురుషోత్తపట్నం, మర్లపాలెం, కొండపావులూరు, తెంపల్లి, గన్నవరం, కేసరపల్లి తదితర గ్రామాల్లో మిరప వేశారు. అంతా వర్షాధారం మీదే ఆధారపడి పంట పండుతుంది. ప్రస్తుతం ఎక్కువ భాగం పూత, పిందె, కాయల దశలో ఉంది. ఈ క్రమంలో ఎర్ర, నల్ల, తెల్ల నల్లుల, లద్దె పురుగు వంటి తెగుళ్ల తీవ్రత అధికంగా ఉంది. ఆకుముడత, బూడిద తెగుళ్ల వ్యాప్తి ఎక్కువగా ఉంది. బూడిద తెగులు సోకిన పంటల రూపే మారిపోతోంది. ఎన్ని మందులు పిచికారీ చేసినా నియంత్రణ కావడం లేదు. నల్లుల ప్రభావం విపరీతంగా ఉండడంతో తీవ్ర నష్టం కలుగుతోంది. మూడు రకాల నల్లులకు వారానికి మూడు సార్లు మందు పిచికారీ చేయాల్సి రావడంతో రైతులపై ఆర్థిక భారం పడుతోంది. రైతు ఒక్కో ఎకరాకు సగటున రూ.1.5 లక్షలు పెట్టుబడి పెట్టారు. అందులో దాదాపు 20 వేల ఎకరాలకు పైగా పంట బూడిద బారిన పడింది. దీంతో దిగుబడి తగ్గుతుంది. ఈ ప్రాంత రైతులు సుమారు రూ.3.5 కోట్లు పెట్టుబడి పెట్టారు. అది వారికి తిరిగి రావడం కష్టంగా మారింది. ఇక (మిగతా 6లో)

పరిశ్రమల ఏర్పాటుకు యువతను ప్రోత్సహించాలి

ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డిల్లీరావు

ప్రజాశక్తి-విజయవాడ

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు యువతను ప్రోత్సహించాలని అధికారులు, బ్యాంకర్లకు జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు సూచించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం కలెక్టర్ డిల్లీరావు అధ్యక్షతన 6వ జిల్లా సంప్రదింపుల కమిటీ (డీసీసీ), జిల్లాస్థాయి సమీక్షా కమిటీ (డీఎల్‌ఆర్‌సీ) సమావేశాలు జరిగాయి. గత సెప్టెంబర్ 26న జరిగిన సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలు పురోగతిపై చర్చించిన అనంతరం జిల్లాలో బ్యాంకింగ్‌కు సంబంధించిన కీలక సూచికల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2023-24 ఆర్థిక సంవత్సరం వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యాల సాధనలో భాగంగా సెప్టెంబర్ 30 నాటికి ప్రాధాన్య రంగానికి రూ. 12,697 కోట్లు (67 శాతం), ప్రాధాన్యేతర రంగానికి రూ. 36,226 కోట్లు (181 శాతం) రుణాలు పంపిణీ జరిగినట్లు వివరించారు. ఎంఎస్‌ఎంఈ రుణాలకు సంబంధించి 73 శాతం పంపిణీ పూర్తయినందున.. స్టాండప్ ఇండియా వంటి ముఖ్య పథకాలను సద్వినియోగం చేసుకునేలా యువతను ప్రోత్సహించాలని సూచించారు. అవసరమైతే ప్రత్యేక డ్రైవ్ చేపట్టి..



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డిల్లీరావు

దరఖాస్తులను పరిష్కరించాలన్నారు. ముఖ్యంగా ఎస్‌సీ, ఎస్‌టీ, మహిళలను పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా చేయడం ద్వారా ఆర్థిక అసమానతలను తగ్గించవచ్చన్నారు. రైతుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పథకాలు అమలుచేస్తున్నాయని.. అవి పూర్తిస్థాయిలో వారికి చేరేలా క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. జగనన్న తోడు, ఏపీ టిడ్కో తదితర పథకాలకు సంబంధించిన దరఖాస్తులను వీలైనంత త్వరగా పరిష్కరించి.. గడువులోగా రుణ మంజూరు జరిగేలా చూడాలన్నారు. రైతు భరోసా కేంద్రాలతో మ్యాప్ చేసిన బ్యాంక్ బ్రాంచులు బిజినెస్ కరస్పాండెంట్లు/బ్యాంకు మిత్రాల ద్వారా రైతులకు అవసరమైన బ్యాంకింగ్ సేవలు అందేలా చూడాలన్నారు. ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్ ద్వారా సుస్థిర, సమతుల్య ఆర్థిక వద్ధి సాధ్యమవుతుందని.. తద్వారా ఆర్థిక అసమానతలు, పేదరికం తగ్గుతుందని వివరిస్తూ ఇందుకు సంబంధించిన లక్ష్యాల సాధనకు ఆర్థిక అక్షరాస్యత ప్రాజెక్టు కార్యక్రమాలను పటిష్టంగా అమలుచేయాలని సూచించారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కింద చేపట్టనున్న కార్యక్రమాలను విజయవంతంగా అమలుచేసేందుకు కషిచేయాలని కలెక్టర్ డిల్లీరావు సూచించారు. సమావేశంలో ఆర్‌బీఐ డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ ఫండ్, కెనరా బ్యాంకు, ఇండియన్ బ్యాంకు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సౌజన్యంతో సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్-కర్నూలు భాగస్వామ్యంతో రూపొందించిన సమాచార కరదీపికను కలెక్టర్ డిల్లీరావు.. బ్యాంకుల ఉన్నతాధికారులు, లీడ్ బ్యాంకు ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో కలిసి ఆవిష్కరించారు. సమావేశంలో ఆర్‌బీఐ ఏజీఎం ఎం.జెడ్.రహ్మాన్, డీసీసీ కన్వీనర్ ఎం.శ్రీధర్, (మిగతా 6లో)


గంటా రామారావు సన్మానిస్తున్న న్యాయవాదులు

హైకోర్టు బార్ కౌన్సిల్ చైర్మన్ గంటా రామారావుకు సన్మానం

ప్రజాశక్తి- నందిగామ : ఆంధ్రప్రదేశ్ హైకోర్టు బార్ కౌన్సిల్ చైర్మన్ గంటా రామారావును బుధ వారం నందిగామ న్యాయ వాదులు ఘనంగా సత్కరిం చారు. నందిగామ బార్ అసోసియేషన్‌ను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు బార్ కౌన్సిల్ చైర్మన్ గంటా రామారావు సందర్శించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు బండి మల్లికార్జునరావు, వైస్ ప్రెసిడెంట్ భాస్కరరావు, సెక్రటరీ పి.ప్రకాష్, మట్టా ప్రసాద్, బొందలపాటి రామకష్ణ, మన్నెం నారాయణరావు, చావలి సాంబశివరావు, ఎక్కిరాల హనుమంతరావు, కొమ్మినేని మౌళేశ్వరావు, కట్టా కిరణ్ కుమార్, ఎస్ఎంకె ఆజాద్, లక్ష్మీనారాయణ, చిరుమామిళ్ల కిరణ్,న్యాయవాదులు సన్మానించారు.

ఆరోపణలు చేస్తే సహించేది లేదు

ఎంఎల్ఎ వసంత

ప్రజాశక్తి మైలవరం : వాస్తవాలను అవాస్త వాలుగా ప్రచారం చేస్తూ తనపై తప్పుడు ప్రచారం చేస్తున్న మాజీ మంత్రి దేవినేనికి ప్రజలే తగిన విధంగా బుద్ధి చెబుతారని మైలవరం ఎమ్మెల్యే వసంత కష్ణ ప్రసాద్ అన్నారు. మైలవరం లోని ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ విటిపిఎస్‌లో లభ్యమయ్యే బూడిద కేంద్ర ప్రభుత్వ విధివిధానాల మేరకు సిమెంట్ తయారీ కంపెనీలకు జాతీయ రహదారుల నిర్మాణాలకు బ్రిక్స్ తయారీకి సరఫరా చేయాల్సిందన్నారు. దానికి అనుగుణంగానే జరుగుతుంటే ఆ బూడిదను తాను అమ్ముకుంటున్నట్లు చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. తన కుటుంబ సభ్యుల గురించి మాట్లాడే అర్హత ఉమాకు లేదన్నారు. ఉమా శవరాజ కియాలు చేస్తున్నారని ఘాటుగా విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణ రెడ్డి సర్పంచి మంజు భార్గవి, ఎంపీపీ లక్ష్మి, అప్పిడి కిరణ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ప్రతినిధులు

26న ఆర్యవైశ్య కార్తీక వన సమారాధన

ప్రజాశక్తి - భవానీపురం : ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ, శ్రీ వాసవి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 26న భవానీపురంలోని పున్నమి ఘాట్ వద్ద కార్తీక మాసంను పురస్కరించుకుని కార్తీక వనసమారాధన నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘాల నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం భవానీపురంలోని ఆలివ్ గ్రీన్ హోటల్లో నిర్వహించిన మీడియా సమావేశంలో శ్రీ వాసవి ఫౌండేషన్ అధ్యక్షులు వి.వి.కె.నరసింహారావు మాట్లాడుతూ భవానీపురం పున్నమిఘాట్ ప్రక్కన ఉన్న స్థలంలో వేలాది మందితో ఉదయం సత్యనారాయణ స్వామి సామూహిక వ్రతాలు నిర్వహించి కార్తీక వన సమారాధన నిర్వహించనున్నట్లు తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాల తో సందడి చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా 26న జరిగే కార్తీక వన సమారాధన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం లో ఆర్యవైశ్య కార్పొరేషన్ సాధన సమితి అధ్యక్షులు కొణిజేటి రమేష్, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షులు కోనా శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

26న రాజ్యాంగ దినోత్సవం

ప్రజాశక్తి - గంపలగూడెం : నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకొని గంపలగూడెం–తోటమాలలో జరుగుతున్న కార్యక్రమాలను సమిష్టిగా విజయవంతం చేయాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. సోమవారం ఈ మేరకు సంబంధిత గోడపత్రికలను తోటమూల విగ్రహాల సెంటర్లో ఆవిష్కరించారు. ఎస్సార్ గార్డెన్ కళ్యాణ మండపం ఎదురుగా ఉన్న కోట కోటేశ్వరరావు గెస్టుహౌస్‌లో ఈ కార్యక్రమం జరుగుతున్నట్లు పేర్కొన్నారు.

వసతి గృహంలో మౌలిక వసతులు కల్పించాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వరరావు



మైలవరంలో పాల్గొన్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి - మైలవరం : ప్రభుత్వ సంక్షేమ హాస్టల్స్‌లో మౌలిక వసతులు కల్పించాలని, మెస్ కాస్మోటిక్ ఛార్జీలు పెంచాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్.వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ మైలవరం మండల 43వ మహాసభ స్థానిక గాంధీ గ్రంథాలయంలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ హాస్టల్స్‌లో మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైం దన్నారు. సరైన వసతులు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. నాడు నేడు పనులు పూర్తి చేయాలని వసతి దీవెన విద్యాదేవిన వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం 23 మందితో నూతన మండలకమిటీని ఎన్నుకున్నారు. నూతన మండల అధ్యక్ష కార్యదర్శులుగా వి.విజయ్‌కుమార్, ఎం.చరణ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా ఎస్.వేద, వి.శ్రీకాంత్, కె.రాజేశ్వరి, వి.రమ్య, సహాయ కార్యదర్శులుగా జై కార్తీక్, ఎం.సాగర్, పి.సాయి, భవాని, కమిటీ సభ్యులుగా విజయ్, శ్రీవల్లి, సుజిత, రాజు, దీపిక, యామిని, వెంకటరమణ, వినయ్, మధు, చిన్న బాబు, వెంకటేశ్వరరావు, నాగరాజులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ నాయకులు సిహెచ్ సుధాకర్, ఉపాధ్యక్షులు ఎం కుమార్ నాయక్‌లు పాల్గొన్నారు.

పలుచోట్ల సంక్షేమ పథకాల బోర్డుల ఆవిష్కరణ


జెండా ఆవిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే వెలంపల్లి తదితరులు

ప్రజాశక్తి - భవానీపురం : పశ్చిమ నియోజకవర్గంలోని 41వ డివిజన్లలో జరిగిన ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో మాజీ మంత్రి, పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు బుధవారం పాల్గొన్నారు. శాసన సభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా విచ్చేసి సచివాలయంలో అమర్చిన పేదలకు చేకూరిన లబ్ధిని వివరించే బోర్డును ఆవిష్కరించి, సచివాలయం పరిధిలో ఏర్పాటు చేసిన జండా దిమ్మను ఆవిష్కరించారు. అనంతరం స్థానిక పెద్దలతో ముఖ ముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఎం.డి ఇర్ఫాన్, జిల్లా వక్ఫ్ బోర్డు అధ్యక్షులు గౌస్ మొహిద్దీన్, 40వ డివిజన్ కార్పొరేటర్ యరడ్ల ఆంజనేయ రెడ్డి, మద్దాల జోసఫ్, లాజర్, జంగం ఆనంద్ కుమార్, నాయకులు, సచివాలయం కన్వీనర్లు, గహ సారథులు తదితరులు పాల్గొన్నారు. **తిరువూరు :** నగర పంచాయతీ పరిధిలోని ఒకటవ సచివాలయంలో వైస్ చైర్మన్ వెలుగోటి విజయలక్ష్మి, కౌన్సిలర్ కొలిక పోగు నిర్మల, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కాలసాని విజ యలక్ష్మి, వైసిపి నాయకులు పాల్గొన్నారు. **గంపలగూడెం:** గోస వీడులో పల్లెకు పోదాం కార్యక్రమం ఇఒపిఆర్‌డి గోగిరెడ్డి శ్రీని వాసరెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో సంక్షేమ పథకాలకు సంబంధించిన వివరాల పట్టికను సర్పంచ్ కె.ప్ర శాంత్ కుమార్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి బొమ్మ రెడ్డి జయలక్ష్మి, నాయకులు, అధికారులు పాల్గొన్నారు. **కంచికచర్ల :** కంచికచర్ల మండలం మోగులూరు గ్రామంలో నందిగామ ఎంఎల్ఎ డాక్టర్ మొండితోక జగన్మోహన్‌రావు సంక్షేమ పథకాల వివరాల డిస్ ప్లే బోర్డును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బషీర్, వైస్ ఎంపిపిలు బండి మల్లిఖార్జున్ రావు, వెలగలేటి మాధవి పాల్గొన్నారు. **వత్సవాయి:** మండలంలోని కన్నెవీడు గ్రామంలో నిర్వహించిన కార్యక్ర మంలో జడ్‌పిటిసి ఏసుపోగు దేవమణి, ఎంపిపి కొలుసు రమాదేవి, ఇఒఆర్‌డి మాధవి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథులు వాలంటీర్లే

జగ్గయ్యపేట: రాష్ట్రంలోని వాలంటీర్ వ్యవస్థ వైపు దేశం మొత్తం చూడడం గర్వంగా ఉందని ప్రభుత్వవిప్ శాసనసభ్యులు సామినేని ఉదయభాను అన్నారు. బుధవారం పట్టణంలోని ఉక్కు కళావేదిక నందు జగ్గయ్యపేట పట్టణ వాలంటీర్లతో రాష్ట్ర ప్రభుత్వవిప్, శాసనసభ్యులు సామినేని ఉదయభాను సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉదయభాను మాట్లాడుతూ రాష్ట్రంలో 2 లక్షల 60 వేలమంది వలంటీర్లు లక్షల మందికి పైగా లబ్ధిదారులకు సేవలు అందించేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నారని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో వాలంటీర్లకు మంచి భవిష్యత్తు ఉంటుందని, ప్రభుత్వం అందించే పథకాలను ప్రజలకు మరింతగా చేరవేయాలని కోరారు.

వేదాద్రిలో బహిరంగ వేలం

జగ్గయ్యపేట: మండలంలోని వేదాద్రిలో గల శ్రీ యోగానంద లక్ష్మి నరసింహ స్వామీ దేవాలయంలో కాఫీ హోటల్ లైసెన్స్ హక్కునకు మొదటిసారి టెండర్ కం బహిరంగ వేలంపాట నిర్వహించారు. బుధవారం డిసెంబర్ 9, 2023 నుండి డిసెంబర్ 8, 2024 ఒక సంవత్సరం కాల పరిమితిగానూ తోట్లవల్లూరు శ్రీ వేణుగోపాల స్వామి వారి దేవస్థానం ఆలయ కార్య నిర్వహణ అధికారి సిహెచ్.హరి దుర్గా నాగేశ్వరరావు, దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్త తరపున కెసిపి ఎజిఎం పి.రాంప్రసాద్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వేలం పాటలో వేదాద్రి గ్రామానికి చెందిన మాగంటి రామకృష్ణ రూ.4.55లక్షలు పాట పాడి దక్కించుకున్నారు. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం రూ.2.77లక్షలు పెరిగినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి సి.జయప్రకాష్‌బాబు తెలి పారు. వేలంపాటలలో ఆలయ సూపర్ నెండెంట్ జి.రవీంద్ర, దేవస్థానం సిబ్బంది, వేలం పాడుదారులు పాల్గొన్నారు.

ఎంఎల్‌సి ప్రత్యేక పూజలు


ప్రజాశక్తి- నందిగామ : నందిగామ పట్టణంలోని రైతు పేట శ్రీ సత్య సాయి నిలయంలో భగవాన్ శ్రీ సత్య సాయి బాబా 98వ జయంతి వేడుకల్లో భాగంగా బుధవారం నిర్వహించిన ప్రత్యేక పూజ కార్యక్రమాలలో శాసనమండలి సభ్యులు డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్ పాల్గొన్నారు. శ్రీ సత్యసాయి జయంతి వేడుకల్లో భాగంగా పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల విజేతలకు ఎమ్మెల్సీ బహుమతులను ప్రదానం చేశారు. ఎమ్మెల్సీని శ్రీ సత్యసాయి సేవా సమితి సభ్యులు శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు.

27, 28 తేదీల్లో మహాధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి వత్సవాయి : ఈ నెల 27,28 తేదీల్లో విజయ వాడలో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి చనుమోలు సైదులు అన్నారు. మండల కేంద్రమైన వత్సవాయిలో రైతు కవిలు రైతు సంఘం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రభుత్వ రంగాన్ని అడ్డగోలుగా ప్రైవేటుపరం చేస్తుందని ఆగ్రహ వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లగా కార్మికులు పోరాడి సాధించుకున్న 42 రకాల చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చి కార్మికుల హక్కులు కాలరాస్తుందని, దేశంలో ఉన్న బడా కార్పొరేట్లకు లక్షల కోట్ల రాయితీలుస్తూ ప్రజల మీద పెను భారాలు మోపుతున్నారని తెలిపారు. రైతుల ఆత్మహత్యలు పెరిగాయని, పార్లమెంట్లో కనీస మద్దతు ధరల చట్టం


వత్సవాయిలో


చందర్లపాడులో


పెనుగంచిప్రోలులో

చేయమంటే చేయటం లేదని, విద్యుత్ సవరణ చట్టం తీసుకువచ్చి ఉచిత విద్యుత్‌కు తిలోదకాలిస్తుందని అన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా నవంబర్ 27, 28 తేదీల్లో విజయవాడలో జరుగు మహాధర్నాలో రైతులు కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మహా ధర్నా కరపత్రం విడుదల చేశారు. **చందర్లపాడు :** మండలంలో కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేశారు. సంఘం జిల్లా కార్యదర్శి చనుమోలు సైదులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి షేక్ హస్సాన్, షేకు ఉద్దండు పాల్గొన్నారు. **పెనుగంచిప్రోలు :** మండల సిఐటియు కార్యదర్శి దారా నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో బుధవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మహాధర్నాకు సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

24 నుండి ద బ్యూటీ సేల్ ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఈ నెల 24 నుండి 26వ తేదీ వరకు అమెజాన్ స్టోర్స్‌లో ద బ్యూటీ సేల్ ప్రత్యేక అమ్మకాలు ప్రారంభించ నున్నట్లు సంస్థ రీజనల్ ప్రతినిధి కె.విశ్వనాథన్ తెలిపారు. నగరంలోని సంస్థ స్టోర్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ ఈసేల్ నందు లగ్జరీ బ్యూటీ ఉత్పత్తులపై 50 శాతం తగ్గింపు ఇవ్వనున్నట్లు తెలిపారు. అన్ని రకాలైన సౌందర్య వస్తువులు కొనుగోలు చేయవచ్చని తెలిపారు. సబ్బులు, బ్యూటీ ఐటెమ్స్, కాస్మోటిక్స్, కొన్ని రకాలైన ఎంపిక చేసిన వాటిపై ప్రత్యేక రాయితీ కూడా ఉంటుందని తెలిపిఆరు. ముఖ్యంగా మహిళలు బ్యూటీ వస్తువులపై ఆసక్తి చూపుతున్నారని వారికోసం ఈ ఆఫర్లు అందిస్తున్నామని తెలిపారు. అంతేకాకుండా శీతాకాం, పండుగల సందర్భంగా కూడా ఈఆఫర్లు అందిస్తున్నామని మహిళలు వినియోగించుకోవాలని కోరారు.

30న కెబిఎన్‌లో జాబ్ మేళా

ప్రజాశక్తి - భవానీపురం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం, ఏపీ స్కిల్ డెవెలప్మెంట్ కార్పొరేషన్ వారిచే జాబ్ మేళా నిర్వహిచనున్నట్లు మాజీ మంత్రి, పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు తెలిపారు. వెలంపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కెబిఎన్ కళాశాల నందు ఈ నెల 30వ తేదీన నిర్వహించనున్న జాబ్ మేళ పోస్టర్‌ను భవానీపురంలోని ఎన్టీఆర్ జిల్లా వైసిపిలో బుధవారం పశ్చిమ శాసన సభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు ఆవిష్కరించారు ఈ కార్యక్రమంలో జిల్లా స్కిల్ డెవెలప్మెంట్ కార్పొరేషన్ అధికారి నరేష్, బుధాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

530 హెక్టార్లకు ఎన్యుమరేషన్


ప్రజాశక్తి - గంపలగూడెం: ప్రభుత్వం గంపల గూడెం మండలాన్ని కరువు మండలంగా ప్రకటించిన నేపథ్యంలో గ్రామాల్లో వ్యవసాయ సహాయకులు రైతులకు సంబంధించి ఎన్యుమరేషన్‌కు (అంచనాలు) తయారు చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఈ విషయమై బుధవారం ఏవో సాయి శ్రీ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 778 వరి మంది రైతులను గుర్తించగా, 530 హెక్టార్లకు గానూ 90 లక్షల వరకు అంచనాలు పూర్తి చేసినట్లు వివరించారు.

విరామంతోనే ఉల్లాసం

గంపలగూడెం: విద్యార్థులకు (చిన్నారులు) విరామంతోనే ఉల్లాసం, ఉత్సాహం ఉంటుం దని మండల విద్యాశాఖ అధికారి పివిడిఎల్. నరసింహారావు తెలిపారు. వినగడప పరిధిలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలు సంయుక్తంగా బుధవారం వన సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న పివిడిఎల్ మాట్లాడుతూ అప్పుడప్పుడు పిల్లలకు విరామ సమయాన్ని కేటాయిస్తేనే మనసు ప్రశాంతత వస్తుందని వెల్లడించారు. విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, ప్రోత్సా హకాలను అందించారు. ఆయా పాఠశాల హెచ్ఎంలు రవికిరణ్, జి కోటేశ్వర రావు, ఏ సుధాకర్ రెడ్డి, రాధా, సిబ్బంది పాల్గొన్నారు.

అసైన్డ్ లబ్ధిదారుల పేర్లు ప్రకటించాలి

ప్రజాశక్తి-గన్నవరం : గ్రామాల్లో అసైన్డ్ భూముల లబ్ధిదారుల పేర్లు ప్రకటించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు యం. ఆర్ఓకి వినతిపత్రం ఇచ్చారు. ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులు అమలు చేయాలన్నారు. సంఘ నాయకులు ఆంజనేయులు, రాంబాబు, తాతబ్బాయి, ఏసుదాసు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-మోపిదేవి :** గత ప్రభుత్వాలు విడతల వారీగా పేదలకు పంపిణీ చేసిన అసైన్డ్ భూములను ప్రస్తుతం లబ్ధిదారులకు శాశ్వత భూహక్కు పత్రాలు పంపిణీ చేసే ప్రక్రియలో భాగంగా 9/77 చట్ట సవరణ చేసినప్పటికీ నిజమైన లబ్ధిదారులకు న్యాయం జరగట్లేదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బండి ఆదిశేషు పేర్కొన్నారు. వాస్తవ లబ్ధిదారుల పేర్లను గ్రామ వార్డు సచివాలయాల్లో బహిరంగ నోటీసుల్లో ఉంచాలని ప్రభుత్వమే ఆదేశాలు జారీ చేసింది కానీ ఏ సచివాలయానికి వెళ్ళిన లబ్ధిదారులు జాబితా కనిపించడం లేదన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆదేశాలు అమలయ్యేలా పేర్లు కనిపించేలా జాబితాలను ప్రదర్శించాలని స్థానిక తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో వ్యవ సాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు బెజవాడ నాగేశ్వరరావు, రాజశేఖర్ శ్రీనివాసరావు, నాగ మల్లేశ్వ రరావు, సుబ్బారావు, వెంకటేశ్వరరావు, సురేష్ గొరిగిపూడి తదితరులు పాల్గొన్నారు


గన్నవరంలో...


మోపిదేవిలో...



అంగన్‌వాడీల సమ్మె నోటీసు అందజేత


ప్రజాశక్తి, మొవ్వ : అంగన్‌వాడీల వేతనాలు పెంపు గ్రాట్యూటి, పెన్క్షన్ అమలు తదితర సమస్యల పరిష్కారం కోరుతూ డిసెంబర్ 8వ తేదీ నుండి నిరవదిక సమ్మె పాటించనున్నట్లు అంగన్‌వాడీ సిబ్బంది మొవ్వ సిడిపిఓ కార్యాలయంలో బుధవారం సమ్మెనోటీసు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు ఎస్.విజయలక్ష్మి, డి.రాజారత్నం, కోశాధికారి చల్లపల్లి గంగాభవానిలతోపాటు పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-ఉయ్యూరు : సమాజంలో వివిధ వర్గాలకు తోచిన విదంగా సాయం చేయడం అభినందనీయమని ఉయ్యూరు నగరపంచాయతీ కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక 15వ వార్డు ఎస్టీ కాలనీలో వద్ధులు, దివ్యాంగులకు సంఘ సేవకుడు గుర్రాల మధు సూదనరావు ఆధ్వర్యంలో బుధవారం దుప్పట పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మధు సూదనరావును ఆదర్శంగా తీసుకుని ఆపన్నులకు సాయపడేందుకు ముందుకు రావాలన్నారు.

కమ్యూనిటీ హాలుకు శంకుస్థాపన



మాట్లాడుతున్న ఎంపి బాలశౌరి

ప్రజాశక్తి-కోడూరు : రాష్ట్రంలో అణగారిన వర్గాలకు మంచి చేయాలని వారి అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని మచిలీపట్నం ఎంపీ బాలశౌరి అన్నారు. బుధవారం కోడూరు గ్రామపంచాయతీ పరిధిలో ని 8వ వార్డులో నిర్మిస్తున్న మల్టీ పర్పస్ కమ్యూనిటీ హాల్ శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలశౌరి మాట్లాడుతూ ఎన్టిపిసి వారి సిఎస్ఆర్ నిధులు 65 లక్షలతో ఈ కమ్యూనిటీ హాల్ నిర్మిస్తున్నారని, త్వరలో కోడూరులో మరొక కమ్యూనిటీ హాల్ మంజూరుకు కృషి చేస్తానన్నారు. హంసలదీవి సాగర్ తీరాన్ని 25 కోట్ల కేంద్ర ప్రభుత్వ నిధులతో అభివద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు, దివి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కొక్కిలిగడ్డ వెంకటేశ్వరరావు, కోడూరు గ్రామపంచాయతీ సర్పంచ్ వెన్న షైనీ, ఎంపీపీ కొండవీటి వెంకట కుమారి, జడ్పిటిసి యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ, కోడూరు పిఏసిఎస్ అధ్యక్షులు పరీసే మాధవరావు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న బుద్ధప్రసాద్

పిట్టలంక

మాజీ సర్పంచ్ మృతి

ప్రజాశక్తి-కోడూరు : పిట్టలంక గ్రామ మాజీ సర్పంచ్ మరియు మాజీ సహకార సంఘం అధ్యక్షులు బడే వెంకటరమణ బుధవారం మధ్యాహ్నం హఠాణ్మరణం చెందారు. ఈ వార్త తెలుసుకున్న మాజీ ఉప సభాపతి డాక్టర్ పండరి బుద్ధ ప్రసాద్ కోడూరు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బండే శ్రీనివాసరావుతో కలిసి నివాళులు అర్పించారు. వీరితోపాటు తోట రాంబాబు, తోట సాంబయ్య, పిట్టలంక సర్పంచ్ కనగాల వెంకటేశ్వరరావు, కొప్పనాతి సత్యనారాయణ, గుత్తి ప్రసాద్, బడే నాగరాజు, బడే పిచ్చియ్య, జనసేన మండల పార్టీ అధ్యక్షులు మర్రి గంగయ్య, తదితరులు నివాళులు అర్పించారు.

30 శాతం పెన్షన్ పెంచాలని నిరసన



ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : జనరల్ ఇన్సూరెన్స్ ఫ్యామిలీ పెన్షనర్లకు 30 శాతం పెంచాలని డిమాండ్ చేస్తూ జిఐఈ, ఎల్ఐఈ పెన్షనర్లు, ఉద్యోగులు, స్థానిక నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ ముందు బుదవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిఇయు మచిలీపట్నం డివిజన్ అధ్యక్షులు జె సుధాకర్ మాట్లాడుతూ దేశంలోని అన్నిప్రభత్వ రంగ సంస్థల్లోని ఫ్యామిలీ పెన్షనర్లకు బేసిక్ లో 30 శాతం ఫ్యామిలీ పెన్షన్ చెల్లిస్తుండగా, జనరల్ ఇన్సూరెన్స్ రంగంలో ఈ సదుపాయాన్ని నిరాకరించడం, కేంద్ర ప్రభుత్వ పక్షపాత వైఖరికి నిదర్శనమని పేర్కొంటూ, అత్యంత న్యాయ సమ్మతమైన ఈ కోర్కెను వెంటనే ఆమోదించాలని ఆయన కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఐసిఆర్ఈఏ మచిలీపట్నం డివిజన్ ప్రధాన కార్యదర్శి వి ఎల్ రాధాకష్ణమూర్తి మాట్లాడుతూ జనరల్ ఇన్సూరెన్స్ రంగం లోని ఫామిలీ పెన్షనర్లందరికీ ఫ్యామిలీ పెన్షన్ను 30 శాతానికి పెంచాలని జి ఎల్ ఈ యాజ మాన్యం 2021 డిశంబరులోనే కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు సిఫార్సు చేసినప్ప టికీ, కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ ఆమోదం తెల్పక పోవడం అన్యాయ మన్నారు. జనరల్ ఇన్సూరెన్స్ ఉద్యోగుల సంఘం డివిజన్ నాయకులు రామకష్ణప్రసాద్ ప్రసంగిస్తూ ఈ సమస్య పరిష్కారానికి ఏ ఐ ఐ పి ఏ తో పాటు, ఎల్ ఐ సిజిఐసిల్లోని ఉద్యోగ, అధికార సంఘాలు సుదీర్ఘకాలంగా ఆందోళన చేస్తున్నప్పటికీ వారు చేస్తున్న హేతుబద్ధ వాదనలు పక్కనపెట్టి, కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ అత్యంత సమ్మతమైన ఈ సమస్య పరిష్కారాన్ని తాత్సారం చేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో జనరల్ ఇన్సూరెన్స్ ఉద్యోగుల పెన్షనర్ల సంఘం నాయకులు ముస్పేక్,సి హెచ్ బ్రహ్మయ్య,పి వి శ్రీనివాసరావు, కె.ధనంజయరావు, నాగయ్య,టి చంద్రపాల్, రాజశేఖర్, స్వామినాథ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిఐ కిషోర్‌బాబు

మాదకద్రవ్యాలపై అవగాహన

ప్రజాశక్తి-పమిడిముక్కల : మాదకద్రవ్యాల వాడకం వల్ల యువత పెడదారిపడుతుందని, గంజాయి పొగాకు ఉత్పత్తులను పూర్తిగా మానేయాలని పమిడిముక్కల సీఐ కిషోర్‌బాబు అన్నారు. బుధవారం మండలంలోని తాడంకి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మారకద్రవ్యాల వినియోగం వాటి వల్ల వచ్చే నష్టాలు గురించి వివరించారు. విద్యార్థులు మంచిగా చదువుకోవాలని, చెడు అలవాట్లకు అలవాటుపడొద్దన్నారు. ఆడపిల్లలు ధైర్యంగా చదువుకోవాలని, ఆడపిల్లలు చదువు దేశానికి ఎంతో ఉపయోగమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పమిడిముక్కల ఎస్సై కిషోర్‌కుమార్, తాడంకి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎలమంచిలి శివనాగప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు ఎస్ఐగా సత్యనారాయణ



ప్రజాశక్తి, గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరు పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ గా జి. సత్యనారాయణ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈస్ట్ గోదావరి జిల్లా నుండి బదిలీపై ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. పోలీస్ స్టేషన్ సిబ్బంది, మహిళా పోలీసులు, ప్రజా ప్రతినిధులు ఎస్సైని పుష్ప గుచ్చాలతో అభినందనలు తెలిపారు.

విద్యతో ఉన్నతశిఖరాలు

ప్రజాశక్తి-కోడూరు : విద్యార్థులు జీవితంలో ముందుకు సాగి విజయం సాధించాలంటే మెరుగైన విద్య చాలా అవసరమని మారుతి కళాశాల ప్రిన్సిపాల్ మూర్తి పేర్కొన్నారు. బుధవారం కోడూరులోని మారుతి డిగ్రీ కళాశాల లో వెల్కమ్ పార్టీ ప్రిన్సిపల్ మూర్తి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ నత్య ప్రదర్శనలు చేస్తూ సరదాగా గడిపారు. విద్య ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుందని, వ్యక్తి వ్యక్తిత్వాన్ని నిర్మించడంలో సహాయపడుతుందని ప్రతి ఒక్క విద్యార్థి దఢ సంకల్పంతో విద్యని అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ప్రిన్సిపల్ మూర్తి ఆకాంక్షించారు. బాలల దినోత్సవ సందర్భంగా కళాశాలలో నిర్వహించిన టాలెంటెడ్ టెస్టుల్లో ప్రతిభ కనపరిచిన విద్యార్థినీ విద్యార్థులకు ప్రథమ ,ద్వితీయ ,తతీయ బహుమతులు ప్రిన్సిపల్ మూర్తి అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

జర్నలిస్టు కుటుంబానికి ఆర్థిక సాయం


చల్లపల్లిలో...

ప్రజాశక్తి-చల్లపల్లి : ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్న సిటీ కేబుల్ జర్నలిస్ట్ కల్లేపల్లి చంద్రకు పది లక్షల రూపాయలు ఎక్స్రే ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వీర్ల శ్రీరామ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చంద్ర కుటుంబానికి ఏపీఎంపీఏ నాయకుల ఆధ్వర్యంలో రూ.21వేలు ఆర్థిక సహాయం చంద్ర కుటుంబ సభ్యులు హేమంత్, హరిణులకు అందించారు. బుధవారం ఏపీఎంపీఏ రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ యాదవ్, రాష్ట్ర కోశాధికారి శ్రీకాంత్, రాష్ట్ర కార్యదర్శి యేమినేని వెంకటరమణ, జిల్లా ఇంచార్జి అల్లాడ ఆంజనేయులు, గుడివాడ ప్రెస్ క్లబ్ కార్యనిర్వాహక కార్యదర్శి తలశిల నాగేశ్వరరావు చల్లపల్లిలో చంద్ర కుటుంబ సభ్యులను పరామర్శించి చంద్ర చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.. ఈ కార్యక్రమంలో ఏపీఎంపీఏ నాయకులు తాతినేని లీలాకష్ణ, ఉప్పాల మోహనకష్ణ, స్థానిక విలేకరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఘంటసాల :** ఆర్థిక సమస్యలతో బలవన్మరణం పొందిన సిటీ కేబుల్ రిపోర్టర్ కళ్ళేపల్లి చంద్ర కుటుంబ సభ్యుల భవిష్యత్తుకు భరోసా కల్పించే లక్ష్యంతో చేపట్టిన సహాయ కార్యక్రమంలో ఘంటసాల జర్నలిస్టు స్పందించి ఘంటసాల మండలంలో ఆర్థిక సహాయ సమీకరణ నిర్వహించారు. మండలంలో వివిధ వర్గాల నుంచీ రూ.లక్షా 13వేలను సమీకరించి ఆనగదును బుధవారం చల్లపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు పేరం మధుసూదనరెడ్డి, షేక్ అహ్మద్ లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జర్నలిస్టులు పాల్గొన్నారు.

నూతన వాహనం ప్రారంభం


కారును ప్రారంభిస్తున్న ఎంఎల్‌సి అరుణ్‌కుమార్

ప్రజాశక్తి - నందిగామ : నంది గామ పట్టణంలోని వైసిపి కార్యాలయం వద్ద రాఘవా పురం గ్రామానికి చెందిన వైసిపి అభిమాని ఎక్కిరాల యెహెూవా కుమారుడు త్యాగరాజు (తేజ) నూతన బోలేరా వాహనాన్ని శాసనమండలి సభ్యులు మొండితోక అరుణ్ కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైయస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సాఫ్టువేర్ ఉచిత శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : రక్ష ఫౌండేషన్ – మానవ సేవా సంస్థ సంయుక్తంగా నిరుద్యోగులకు, విద్యార్థులకు ఉచితంగా సాఫ్టువేర్ శిక్షణా తరగతులను నిర్వహించనున్నట్లు రక్ష ఫౌండేషన్ వైస్ ఛైర్మన్ పడమటి స్నిగ్ధ తెలిపారు. పటమటలోని సంస్థ కార్యాలయంలో ఉచిత శిక్షణా తరగతుల వివరాలను తెలియచేసేందుకు బుధవారం ఉదయం విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటికే రక్ష ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు విద్య కొరకు పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. అయితే నేడు ఎంతో ప్రధానమైన ఎస్‌ఎపి (సిస్టమ్ అప్లికేషన్ ప్రొడక్ట్)పై ఉచిత శిక్షణ అందించేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. డిగ్రీ విద్యార్హత కలిగిన విద్యార్థులు అందరు ఈ శిక్షణ కొరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. శిక్షణా తరగతులు ప్రతి శని, ఆదివారాలలో రోజుకు మూడు గంటల పాటు నిపుణులైన సాఫ్టువేర్ సిబ్బందిచే నిర్వహించనున్నట్లు తెలిపారు. తమ ఫౌండేషన్ 2009లో ప్రారంభించామని అప్పటి నుండి వివిధ సేవా కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్నామని తెలిపారు. డిగ్రీ చదివి అర్హత, ఆసక్తి ఉన్న వారు ఈశిక్షణకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో మానవ సేవా సంస్థ నిర్వాహకులు వంగర సురేష్ కుమార్ పాల్గొన్నారు.

గుమ్మా ఉమాశంకర్ సంస్మరణ సభ


నివాళులర్పిస్తున్న ఎంఎల్‌ఎ వెలంపల్లి తదితరులు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : కృష్ణా జిల్లా శిష్టకరణ సంఘం అధ్యక్షులుగా, అఖిల భారత శిష్టకరణ సంఘం కోశాధికారిగా సేవలందించిన గుమ్మ ఉమాశంకర్ సంస్మరణ సభ విజయవాడ సోషల్ క్లబ్ అండ్ లిటరల్ సొసైటీ హాల్‌లో సంఘం కృష్ణా జిల్లా ప్రధాన కార్యదర్శి బలివాడ శివకుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో పశ్చిమ శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొని ఉమాశంకర్‌కు నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత శిష్టకరణ సంఘం అధ్యక్షులు డబ్బీరు కష్ణారావు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శిష్టకరణ సంఘం అధ్యక్షులు పోలు మహంతి ఉమామహేశ్వరరావు, వైసిపి నాయకులు బెహరా భాస్కర్‌రావు, డియస్‌పి బలివాడ నాగేశ్వరావు, తెలుగుదేశం నాయకులు అక్కుమహంతి రాజా, డి.వి.రమణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధిలో రాజీపడం : సామినేని

జగ్గయ్యపేట: పట్టణ మున్సిపల్ పాలకవర్గం ఏర్పడి రెండేళ్ళు పూర్తయిన సందర్భంగా మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అధ్యక్షతన బుధవారం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ప్రభుత్వవిప్, శాసన సభ్యులు సామినేని ఉదయభాను పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ పట్టణాభివృద్ధిలో రాజీపడే ప్రసక్తే లేదని, ఎవరెన్ని కుట్రలు చేసి అభివద్ధి పనులకు అడ్డుపడ్డా వెనకడుగు వేసే ప్రసక్తే లేదన్నారు. గండ్రాయి, దాములూరు వద్ద డ్రాఫ్ట్ వద్ద ఒక టీయంసీ నీటిని విడుదల చేశామని చెప్పారు. పట్టణంలో రూ. 75 లక్షలతో షాదీఖానా ఏర్పాటు చేస్తున్నామని ఉదయభాను తెలిపారు. అనంతరం మున్సిపల్ కౌన్సిల్ రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కౌన్సిల్ సభ్యులతో కలసి కేక్ చేశారు. ఈ సమావేశంలో 44 అజెండా అంశాలను కౌన్సిల్ సభ్యులు ఆమోదించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ సిహెచ్ నాగమల్లేశ్వరరావు, డిఇ కోటేశ్వరరావు, ఏఈ హనుమంతరావు, శానిటరీ ఇన్స్పెక్టర్ దుర్గాప్రసాద్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ లు తుమ్మల ప్రభాకర్, ఆఫీసునిసా, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభిప్రాయం మేరకే ఫుడ్‌కోర్టు ఏర్పాటు చేయాలి

సిపిఎం కార్పొరేటర్ బోయి సత్యబాబు


స్థానికులతో మాట్లాడుతున్న సత్యబాబు


ఫుడ్‌కోర్టు ఏర్పాటు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న బేగ్

ప్రజాశక్తి - వన్‌టౌన్ : వన్‌టౌన్ పంజా సెంటర్‌లో ముసాఫిర్ ఖానా సెంటర్‌లో ఫుడ్‌కోర్ట్ ఏర్పాటు అంశంపై ప్రజాభిప్రాయాన్ని సేకరించిన తర్వాత మాత్రమే చర్యలు చేపట్టాలని సిపిఎం ఫ్లోర్ లీడర్, 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు నగరపాలక సంస్థ మేయర్ రాయన భాగ్యలక్ష్మికి, కమిషనర్ పుండ్కర్‌కి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా బుధవారం పంజా సెంటర్‌ను సందర్శించిన బోయి సత్యబాబు కొంతమంది మహిళలతో మాట్లాడారు. అనంతరం సత్యబాబు మాట్లాడుతూ రైల్వే స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న పాతబస్తీ, పంజా సెంటర్ ప్రాంతంలో ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉంటుందని, అటువంటి ప్రాంతంలో ప్రజాభిప్రాయానికి భిన్నంగా ఫుడ్ కోర్టు ఏర్పాటు చేయటం సరికాదని అన్నారు. ఇప్పటికే నగరంలో ఇందిరాగాంధీ స్టేడియం వద్ద, బిఆర్‌టిఎస్ రోడ్‌లో ఏర్పాటు చేయబడిన ఫుడ్ కోర్టులు వలన స్థానిక ప్రజా ప్రతినిధులు, వ్యాపారస్తులను భయపెట్టి దౌర్జన్యంగా నెలవారి మామూలు వసూలు చేస్తూ అవినీతి అక్రమ చర్యలకు పాల్పడుతున్నారనే వార్తలు పత్రికల్లో మీడియా ద్వారా బయట పడుతున్నాయన్నారు. ఫుడ్‌కోర్టుకు వచ్చేవారు తమ వాహనాలు పార్కింగ్ చేసుకోవటానికి కూడా స్థలం లేదని, అలాంటి ప్రాంతంలో ఎలా ఫుడ్‌కోర్డు ఏర్పాటు చేయాలనుకుంటున్నారని బోయి సత్యబాబు ప్రశ్నించారు. నగరపాలక సంస్థ మేయర్, కమిషనర్, ఇతర ప్రజాప్రతినిధులు ఈ విషయంపై సానుకూలంగా పునర్ ఆలోచన చేయాలని సత్యబాబు పేర్కొన్నారు. ఈ పర్యటనలో సిపిఎం పశ్చిమ నగర నాయకులు కే.సూరిబాబు. పి. రాజు బాబు ఖాన్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక పంజా సెంటర్లో రహదారి వెంబడి ఫుడ్‌కోర్టు ఏర్పాటు అంటూ కొందరు వైకాపా నేతలు పలువురు ఆశావహుల నుంచి లక్షల వసూళ్లకు పాల్పడటంపై విజయవాడ నగరం మున్సిపల్ కమిషనర్ తక్షణమే విచారణను చేపట్టాలని ఎంఎస్.బేగ్ డిమాండ్ చేశారు. ఫుడ్ కోర్టు ఏర్పాటుకు అనుమతి ఉందో లేదో తెలియదు కానీ ఇక్కడ మాత్రం దుకాణాలు కేటాయిస్తామని కొందరు వైకాపా దళారులు బేరాలకు దిగుతున్నారని, లక్షలు డిమాండ్ చేస్తున్నారన్నారు. ఇది నమ్మిన కొందరు ఆశావహులు ఇప్పటికే వైకాపా దళారులకు అడిగినంత మొట్ట చెప్పారనే ప్రచారం గుప్పుమంటుందని బేగ్ ఈ సందర్భంగా ధ్వజమెత్తారు. స్థానిక ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మేయర్, డివిజన్ కార్పొరేటర్ల కోటా కింద మొత్తం 12 దుకాణాలకు బేరాలు జరిగినట్టు, లక్షలు చేతులు మారినట్టు ఇక్కడ ప్రచారం ఊపందుకుందన్నారు.

ముగిసిన వారోత్సవాలు

విజయవాడ : రామమోహన్ గ్రంథాలయంలో వారోత్సవాల ముగింపు సమావేశం బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ప్రముఖ సాహితీవేత్త, ప్రసిద్ధ ఆయుర్వేద వైద్యులు, ప్రపంచ తెలుగు రచయితల సంఘం కార్యదర్శి డాక్టర్ జి.వి.పూర్ణచంద్ హాజరయ్యారు. గ్రంథాలయ అధ్యక్షులు చింతలపూడి కోటేశ్వర రావు వివిధ పోటీలను గురించి, కార్యదర్శి వేములపల్లి కేశవరావు అభివృద్ధి పనుల గురించి వివరించారు. క్విజ్ పోటీల విజేతలకు పూర్ణచంద్ బహుమతులు అందజేశారు. చిత్రకళ ప్రదర్శన ఏర్పాటు చేసిన పి.చిదంబరేశ్వరరావును కమిటీ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రంథాలయ కమిటీ సభ్యులు, పాల్గొన్నారు.

వసంత బహిరంగ క్షమాపణ చెప్పాలి : గన్నె


మాట్లాడుతున్న గన్నె ప్రసాద్

ప్రజాశక్తి - మైలవరం: తనపై లేనిపోని ఆరోపణలు చేసిన మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ బహిరంగ క్షమాపణ చెప్పాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గన్నె ప్రసాద్ (అన్న) డిమాండ్ చేశారు. స్థానిక గన్నె ప్రసాద్ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ నేను నీతిమంతుడిని అని చెప్పే ఎమ్మెల్యే వసంత తనపై రౌడీ షీట్ ఉందని గతంలో నందిగామ నుంచి బహిష్కరించారని తన ప్రస్తావని ఎందుకు తీసుకొచ్చారు చెప్పాలన్నారు. తనకు క్షమాపణ చెప్పకపోతే లీగల్‌గా కోర్టుకు వెళ్తానని అన్నారు. తెదేపా అధినేత చంద్రబాబు ఆదేశిస్తేనే మైలవరంలో పార్టీ అభివద్ధికి కషి చేస్తున్నానన్నారు. నిబద్ధతగల కార్యకర్తగా పార్టీ కోసం పనిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కులగణన సర్వేపై శిక్షణ

ప్రజాశక్తి- నందిగామ : నందిగామ పట్టణంలోని పురపాలక సంఘం కార్యాలయములో మున్సిపల్ కమిషనర్ డాక్టర్ ఎస్.జయరాం ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బందితో బుధవారం ప్రభుత్వం ప్రతిష్టాత్మకముగా చేపట్టబోవు “కుల గణన సర్వే ” కార్యక్రమంపై శిక్షణ నిర్వహించారు. ఈ కుల గణన సర్వే నవంబర్ 27 నుండి వారం రోజుల పాటు సర్వే నిర్వహించడంతో పాటు కుల గణన సర్వే మొబైల్ యాప్ ద్వారా పట్టణములోని అన్ని సచివాలయ పరిధిలో క్లస్టర్ల వారిగా సర్వే నిర్వహించడంతో పాటు సూపర్ వైజర్ ల పర్యవేక్షణలో జరుగుతుందని కమిషనర్ తెలిపారు. 18 సంవత్సరాల పైబడి వారి నుండి మరియు వారితో పాటు సచివాలయ సిబ్బంది కూడా ఈకేవైసి తప్పకుండ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమములో మునిసిపల్ అసిస్టెంట్ ఫణి శ్రీనివాసరావు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ పట్టణంలోని 1వ వార్డు కుమ్మరి బజార్‌లో పలు అభివృద్ధి పనులకు నందిగామ ఎమ్మెల్యే మొండితోక జగన్ మోహన్‌రావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మునిసిపల్ సాధారణ నిధులు రూ.15.31 లక్షల అంచనా వ్యయంతో పలు సిసి రోడ్లు డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. నందిగామ పట్టణ అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. ప్రాధాన్యత క్రమంలో ప్రతి వార్డులో అభివద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. రూ.15 కోట్లతో డ్రైనేజీల నిర్మాణాలను పూర్తి చేశామని తెలిపారు. వార్డుల్లో పెద్ద ఎత్తున సిసి రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ జయరాం, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ మహమ్మద్ మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రం ప్రారంభం


రైతు భరోసా కేంద్రం ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ వసంత

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : నాగార్జున సాగర్ ప్రాజెక్టులో నీళ్ల లేకుండా ఎక్కడి నుంచి నీళ్ల తెచ్చి ఇవ్వాలి అంటూ మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావును మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు ప్రశ్నించారు. రెడ్డిగూడెం మండలం రంగాపురంలో రూ.21.80 లక్షల వ్యయంతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం భవనాన్ని, రూ.20.80 లక్షల వ్యయంతో నిర్మించిన వైఎస్‌ఆర్ గ్రామీణ ఆరోగ్య కేంద్రం భవనాన్ని శాసనసభ్యులు కష్ణప్రసాద్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైలవరం పశుపతి దేవినేని ఉమాకు అన్ని తెలిసే మాట్లాడుతున్నాడని పేర్కొన్నారు.

రంగాపురం అభివృద్ధికి రూ.60 లక్షలు

రంగాపురం గ్రామ అభివృద్ధికి రూ.60 లక్షలు నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. నాయకులందరూ సమన్వయంతో ఈ నిధులను ప్రజలకు మౌలిక వసతులు కల్పించడానికి సద్వినియోగం చేయాలని సూచించారు. పనులు కూడా నెల వ్యవధిలోనే పూర్తి చేయాలని ఆదేశించారు. తను చేసిందే చెబుతానన్నారు. రంగాపురం గ్రామంలో ప్రజలకు సంక్షేమ పథకాలు నిమిత్తం 39 కోట్ల రూపాయలు ఇప్పటివరకు చెల్లించినట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో ప్రజాప్రతినిధులు, వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, విద్యార్థులు

సొంత భవనం ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - తిరువూరు : నియోజకవర్గ కేంద్రమైన తిరువూరులోని ఎస్సీ బాలికల కళాశాల హాస్టల్‌కు సొంత భవనం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థినులు బుధవారం వసతి గృహం ముందు ధర్నా చేసి తహశీల్దార్ సురేష్ బాబుకు వినతిపత్రం అందజేశారు. కొన్ని ఏళ్ల గడుస్తున్నా కాలేజీ హాస్టళ్లకు సొంత భవనాన్ని నిర్మించకపోవటంతో అద్దె భవనంలో సరైన వసతులు లేక విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారని ఎస్ఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు ఎం.సోమేశ్వరావు ఆరోపించారు. సొంత భవనాన్ని ఏర్పాటు చేయకపోతే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన ఉధతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

‘ఇసుకలో వెయ్యి కోట్లు దోచుకున్నారు’

ప్రజాశక్తి మైలవరం : జిల్లాలో బినామీలను అడ్డం పెట్టుకొని ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ ఇసుకలో రూ.వెయ్యి కోట్లు దోచుకున్నారని మాజీ మంత్రి టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమామహేశ్వర రావు ఆరోపించారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ సిఎం జగన్ న్యాయవ్యవస్థను అపహాస్యం చేస్తున్నారని, చంద్రబాబుకు హైకోర్టు ఉన్నత న్యాయస్థానం బెయిలిస్తే అడ్వకేట్ జనరల్ ఢిల్లీ వెళ్లి రంకెలు వేస్తున్నారని విమర్శించారు.

మహిళా సంక్షేమానికి పెద్దపీట

ప్రజాశక్తి వత్సవాయి : మండల కేంద్రమైన వత్సవాయిలో, మండల సమైక్య కార్యాలయంలో మండల సమైక్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ మహిళలకు సమాన అవకాశాలు కల్పిస్తున్న ప్రభుత్వం తమదేనని అన్నారు. ప్రతి అడుగులోనూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మహిళలకు అండగా ఉన్నారని పేర్కొన్నారు. ప్రతి ఇంటిలో మహిళకు ప్రాధాన్యత పెరగడానికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ఒక కారణమన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా ఏ డి సి సి బ్యాంకు మాజీ ఛైర్మన్ తన్నీరు నాగేశ్వరావు, మండల సమైక్య అధ్యక్షురాలు గంగిపోగు శిరీష పాల్గొన్నారు.

వ్యాన్ ఢీకొని వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి వత్సవాయి : వ్యాన్ ఢీకొనటంతో బ్రిడ్జిపై నుండి స్కూటర్‌తో సహా కింద పడిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. కోదాడకు చెందిన రామకష్ణ, సూర్యాపేటలో ఓ ప్రైవేటు బ్యాంకులో ఉద్యోగం చేస్తున్నాడు. తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా బోనకల్లు వ్యక్తిగత పనుల మీద వెళ్లి తిరిగి వస్తుండగా లింగాల బ్రిడ్జిపై వచ్చేసరికి వెనక నుండి వ్యాను ఓవర్ టేక్ చేస్తూ స్కూటర్‌ని ఢీకొనటంతో బ్రిడ్జి పక్కన రాళ్లలో పడిపోయాడు. రామకష్ణకు కుడి భుజం దెబ్బ తగిలింది. బ్రిడ్జిపై వెళ్తున్న ప్రయాణికులు రామకృష్ణకు సపర్యలు చేశారు. బంధువులకు సమాచారం ఇచ్చారు.

జనసేన కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి- నందిగామ : నందిగామ గీతా మందిర్ రోడ్డులో బుధవారం జనసేన నూతన కార్యాలయాన్ని జనసేన నందిగామ నియాజకవర్గ ఇన్‌చార్జ్ తంబళ్లపల్లె రమాదేవి ప్రారంభించారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దించుతామన్నారు. జనసేన, తెదేపా నేతలతో కలిసి నూతన జనసేన పార్టీ కార్యాలయాన్ని మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య సందర్శించారు.

సబ్సిడీపై టార్పాలిన్‌లు, విత్తనాలు అందించాలి



ప్రజాశక్తి, మొవ్వ : కృష్ణాజిల్లాలో ప్రస్తుతం పలుచోట్ల వరి కోతలు, నూర్పిల్లు జరుగుతున్న నేపధ్యంలో రైతాంగానికి అవసరమైన టార్పాలిన్‌లు, రబీసాగుకు అపరాల విత్తనాలు ఆర్‌బికెల ద్వారా 50 శాతం సబ్సిడీపై అందించాలని కృష్ణాజిల్లా, కౌలు రైతుసంఘం సహాయక కార్యదర్శి శీలం నారాయణరావు డిమాండ్ చేశారు. మంగళవారం నుండి కురిచిన వర్షాలకు రైతులు, కౌలు రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులకు వరి ధాన్యం నిల్వ చేసుకు నేందుకు అవకాశం లేకపోవడంతో ప్రైవేటు వ్యాపాం స్తులకు వారం రోజులు గడువుతో తక్కువ ధరకే విక్రయించి నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని వెంటనే ఆర్.బి.కెల ద్వారా టార్పాలిన్‌లు అపరాల విత్తనాలు రైతులకు, కౌలు రైతులకు అందరికి అందించాలని డిమాండ్ చేశారు. ఆర్‌బికెలలో ధాన్యం కోనుగోలు వెంటనే చేపట్టాలన్నారు. గత ఏడాది ధాన్యం అమ్మకాలలో ఎదురైన ఇబ్బందుల దృష్ట్యా రైతాంగం ఆర్ధిక నష్టం వాటిలిన ప్రైవేటు వ్యాపారులకే తక్కువ ధరకు ధాన్యం విక్రయించటానికి ప్రభుత్వ వైఫల్యమే కారణమన్నారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని అధికారులు మద్ధతు ధరకు ధాన్యం కొనుగోలు ఆర్‌బికెల ద్వారా యుద్ధప్రాతిపదికన చేపట్టాలని శీలం నారాయణరావు డిమాండ్ చేశారు.



రైతుల రుణాలపై కళాజాత

ప్రజాశక్తి-పమిడిముక్కల : రైతులకు సహకార బ్యాంకులు ఎప్పుడూ అందుబాటులో ఉంటున్నా యని వీరంకిలాకు కోపరేటివ్ బ్యాంక్ మేనేజర్ ఉదయ్ కుమార్ అన్నారు. బుధవారం పమిడిముక్కల మండ లంలోని కృష్ణాపురం, అగ్నిపర్రు సహకార బ్యాంకులలో రుణ లపై కళాజాత కార్యక్రమం జరిగింది. ప్రధానమంత్రి జీవనజ్యోతి, ప్రధానమంత్రి సురక్ష రైతులకు ఇచ్చే రుణాలు తక్కువ వడ్డీకే ఇస్తున్నట్లు చెప్పారు. ఈకార్యక్రమంలో కష్ణాపురం సహకార బ్యాంకు కార్యదర్శి లీలాకష్ణ, అగ్నిపర్రు కార్యదర్శి సుబ్బారావు పాల్గొన్నారు.

ఎన్నికలకు నోడల్ అధికారుల నియామకం

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : వచ్చే ఏడాది 2024లో జరగనున్న లోక్ సభ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ సాధారణ ఎన్నికలలో వివిధ అంశాలలో సమర్ధవంతంగా ఎన్నికల విధుల పర్యవేక్షణకు 16 మంది నోడల్ అధికారులను నియమిస్తూ జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ పి రాజాబాబు ఉత్తర్వులు జారీ చేశారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మంగళవారం ఈ ఉత్తర్వులు జారీ చేశారు. ఓటర్లకు అవగాహన కల్పించే కార్యక్రమాలు(స్వీప్) నిర్వహణకు నోడల్ అధికారిగా జిల్లా సంయుక్త కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్, వారికి సహాయకులుగా, ఈఆర్వోలు, ఏఈఆర్వోల సమన్వయ విధులు జిల్లా సహకార శాఖ అధికారి వివి ఫణికుమార్, జిల్లా వత్తి విద్యాధికారి బి ఎస్ ఆర్ వి ప్రసాద్ నిర్వహించాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. శాంతిభద్రతలు, నిఘా పర్యవేక్షణ, భద్రతా ప్రణాళిక నోడల్ అధికారిగా జిల్లా సంయుక్త కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్, వారికి సమన్వయ అధికారులుగా పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఏ శ్రీధర్, అదనపు పోలీసు అధికారి ఆర్ శ్రీహరిబాబులను నియమించారు. ఓటర్ల జాబితా తయారీ ఈఆర్ఓ లతో సమన్వయ నోడల్ అధికారిగా డిఆర్ఓ పెద్ది రోజాను, మాన్ పవర్ మేనేజ్మెంట్ నోడల్ అధికారిగా జెడ్పీ ఉప ముఖ్యకార్య నిర్వహణ అధికారి ఏ శ్రీనివాసరావు,, వారికి సమన్వయ అధికారులుగా జిల్లా ఖజానా లెక్కల అధికారి ఎస్ రవికుమార్, ఎన్ఐసి జిల్లా ఇన్ఫర్మేటిక్స్ అధికారి ఫణి కష్ణను నియమించారు.

'కూచిపూడి నాట్యం అధ్యయనం' పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-మొవ్వ : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం శ్రీ సిద్ధేంద్రయోగి కూచిపూడి నాట్యకళా పీఠం లోని శ్రీ బాలా త్రిపుర సుందరి గ్రంథాలయంలో బుధవారం"25 పుస్తకాల ముఖచిత్రాలతో కూడిన కూచిపూడి నాట్యం.. అధ్యయనం"పుస్తకాన్ని ఆవిష్కరిం చారు. కణ్వ పురి పాండు రంగ విఠల్, (వేములమడ) రూపొందించిన ఈ గ్రంథాన్ని నాట్య కర్తలలో ఒకరైన యాజ్ఞవల్క్య మహర్షి జయంతి సందర్భంగా కళా పీఠం ప్రధాన చార్యులు కళారత్న డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రిఆవిష్కరించి తొలి కాపీని గ్రంథాలయ అధికారి ఏలేశ్వరపు వెంకటేశ్వర ఫణి కుమార్‌కు బహుకరించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రి మాట్లాడుతూ యాజ్ఞవల్క్య మహర్షి జయంతి సందర్భంగా ఆవిష్కరించిన ఈ సంపుటి ' నాట్య విద్యా ర్థులకు డిక్షనరీ మాదిరిగా ఉపయోగ పడుతుం దన్నారు. ఈ కార్య క్రమంలో కళారత్నడాక్టర్ వేదాంతంరాధేశ్యామ్, శ్రీ సిద్ధేంద్ర జిల్లా పరిషత్ ఓరియంటల్ హైస్కూల్ ప్రదానోపాద్యాయులు నెమ్మాని శేషసాయి కుమార్, నాట్య కళా పీఠం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ యేలేశ్వరపు శ్రీని వాసులు, టీచింగ్ అసిస్టెంట్లై డాక్టర్ వేదాంతం వెంకట దుర్గాభవాని , పసుమర్తి హరనాధ శాస్త్రి, కళా పీఠం విద్యార్థినీ విద్యార్థులు, కంప్యూటర్ నిర్వాహకులు వెంపటి రాము, కణ్వపురి పాండురంగ విఠల్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

శివశంకర్ పుట్టినరోజు వేడుకలు



కేక్ కట్ చేస్తున్న శివశంకర్

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్ : స్థానిక జనసేన యువ నాయకుడు, గరికపాటి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గరికపాటి శివశంకర్ జన్మదిన వేడుకలు మంగళవారం రాత్రి హనుమాన్‌జంక్షన్‌లో ఘనంగా నిర్వహించారు. జన్మదిన వేడుకల్లో పాల్గొన్న జనసేన నాయకులు,కార్యకర్తలు కేకు కట్ చేసి శివశంకర్ కు జన్మదిన వేడుకలు తెలిపారు. .జంక్షన్ ప్రధాన రహ దారుల్లో జనసేన శ్రేణులు జండాలు చేతబట్టి పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో శివశంకర్ జనసేన శ్రేణులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం పెరికీడు లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అమ్మిశెట్టి వాసు, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకష్ణ, రాష్ట్ర కార్యదర్శి మండలి రాజేష్,గుంటూరు జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



అక్షయను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు అక్షయ ఎంపిక

ప్రజాశక్తి ఘంటసాల : ఘంటసాల మండల పరిధిలోని శ్రీకాకుళం జడ్పీ హైస్కూల్ విద్యార్థిని పైడిపాముల అక్షయ జాతీయస్థాయి సాఫ్ట్ బాల్ జట్టుకు ఎంపికైనట్లు హెచ్ఎం అమ్మిరెడ్డి అనుపల్లవి భువనేశ్వరి తెలిపారు. బుధవారం పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో విద్యార్థి అక్షయ, తండ్రి పైడిపాముల ఆనంద్ కుమార్ ను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ నెల 18, 19, 20 తేదీల్లో గుంటూరు జిల్లా వెనిగండ్లలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీలలో కష్ణా జిల్లా జట్టుకు అక్షయ ప్రాతినిధ్యం వహించింది. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ త్వరలో ఛత్తీస్ ఘడ్ రాష్ట్రంలో నిర్వహించే జాతీయ స్థాయి పోటీలలో ఏపీ జట్టుకు అక్షయ ప్రాతి నిధ్యం వహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ బడే వెంకటేశ్వరరావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ తోడేటి సుధీర్, తెలుగురావుపాలెం సర్పంచ్ రాచురి ప్రసాద్, శ్రీకాకుళం సర్పంచ్ ముప్పనేని రవిప్రసాద్, స్థానిక ఎంపీటీసీ తాడికొండ చిన్నా, ఘంటసాల ఎంపీడీఓ చినరాట్నాలు, ఉపాధ్యాయ, ఉపాధ్యేయేతర సిబ్బంది, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొని అభినందనలు తెలియపరచారు.

రాష్ట్రస్థాయి పోటీలకు హర్షవర్ధన్ ఎంపిక



ప్రజాశక్తి-గూడూరు: గుంటూరు జిల్లా నరసారా వుపేటలో గురువారం నుండి మూడు రోజుల పాటు జరగనున్న స్కూల్ గేమ్స్ అథ్లెటిక్స్ రాష్ట్ర స్థాయి పోటీల్లో గూడూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో తొమ్మిదవ తరగతి చదువుతున్న విద్యార్థి హర్షవర్ధన్ ఎంపికయ్యారని పిడి అరుణ తెలిపారు. అండర్ 14 బాయ్స్ విభాగములో హైజంప్ పోటీల్లో పాల్గొంటాడన్నారు. ఈ సందర్భంగా హైస్కూల్ ప్రధానోపాధ్యాయుని డి.పుష్పలత, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కొల్లు వాసు, ఎం అరుణ, సి హెచ్ రాజేష్, ప్రసన్న తదితరులు హర్షవర్ధన్ ను అభినందించారు.

హెచ్చరిక బోర్డు ఏర్పాటు



హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసిన దృశ్యం

ప్రజాశక్తి-ఘంటసాల : కార్తిక మాసం సందర్భంగా కష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు వచ్చే భక్తులకు ముందస్తు హెచ్చరికలు తెలియజేస్తూ ఘంటసాల పోలీసు శాఖ ఆధ్వర్యంలో హెచ్చరిక బోర్డులను శ్రీకాకుళం కష్ణా నదీ ప్రాంతంలో ఏర్పాటు చేశారు. బుధవారం బోర్డులు ఏర్పాటు చేసిన అనంతరం ఎస్ఐ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ గత 2019వ సంవ త్సరంలో శ్రీకాకుళం గ్రామంలో కష్ణానదిలో స్నానాలు ఘాట్లో ఇద్దరు వ్యక్తులు స్నానానికి నది లోపలికి దిగి ప్రమాదవశాత్తు మునిగిపోయారని తెలిపారు. ప్రస్తుతం కార్తీక మాసం నేపథ్యంలో ఇతర పండుగల నేపథ్యంలో భక్తులు అధిక సంఖ్యలో స్నానాలకు విచ్చేసినప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. లోతట్టు ప్రాంతాలకు వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని సూచిస్తూ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ పద్మారావు పాల్గొన్నారు..

చిరుజల్లులతో రైతుల్లో గుబులు



పెనమలూరు ప్రాంతంలో కోతలు కోసిన దృశ్యం

పెనమలూరు : ఖరీఫ్ చేతిపంట చేతికందే తరుణంలో వాతావరణం లో ఏర్పడుతున్న మార్పులు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి.అల్పపీడన ప్రభావంతో గురువారం ఉదయం నుండి ఒక్కసారిగా ఆకాశం మేఘావతమై మబ్బులు కమ్మేసింది.పెనమలూరు నియోజకవర్గంలోని పలు చోట్ల అక్కడక్కడా జల్లులు కురిశాయి.ఇప్పటికే రైతులు వరి పంట కోత కోసి బహిరంగ ప్రదేశాల్లో ఆరబోసుకున్నారు.మరికొన్ని చోట్ల కూలీలతో కోత కోయించటంతో పనలు పొలాల్లో ఉన్నాయి.**ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** అకాల వర్షాం కారణంగా మండల రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆరుకాలం కష్టించి పండించిన పంట చేతికి వచ్చే సమయానికి వర్షాల కారణంగా రైతన్న తీవ్ర స్థాయిలో నష్టానికి గురయ్యా పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో గత మూడు రోజులుగా వరి పంట కోతలు ప్రారంభించారు. బుధవారం కురిసిన వర్షానికి పంటను కోత మిషన్ ద్వారా కోసిన ధాన్యాన్ని ఒడ్డుకు చేర్చుకున్నారు. అయితే వాటిని సంచుల్లో పట్టే సమయానికి వర్షం రావడంతో కొన్ని గ్రామాల్లో ధాన్యం తడిచిపోగా అవకాశం ఉన్న కొంతమంది రైతులు పరదాలు కప్పుకుని జాగ్రత్త పరిచారు. ఈ వర్షం కారణంగా తయారైన పంటను సమయానికి కోతకోయలేని పరిస్థితుల్లో రైతులు ఉన్నారు. **ప్రజాశక్తి-మోపిదేవి :** ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికి వచ్చేసరికి తుఫానులు విపత్తులో ఈదురుగాలులు వర్షాలు వల్ల నేలకొరిగి రైతన్నలు తీవ్ర నష్టాలకు గురవుతున్నారు మంగళవారం ఉదయం నుంచి మొదలైన వాన చలిగాలులు ఒకటికి ఒకటి తోడై బంగారు వర్ణంలో దగదగలాడుతున్న వరి పంటను నేలకి చాపల అంటుకునేలా చేశాయి. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచే రైతులు వరి సాగులో తీవ్ర కష్టాలు ఎదుర్కొన్నారు. మండలంలోని అధిక శాతం రైతులు కోత మిషన్ సిద్ధం చేసుకుని పంటను రక్షించుకోవాలని ప్రయత్నాలు మొదలుపెట్టే లోపే పనులకు ఆటంకం కలిగిస్తూ వరుణుడు అడ్డుపడడంతో పంట దిగుబడి తగ్గుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



నేటి నుంచి ఇళ్లస్థలాలకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్

ప్రజాశక్తి-విజయవాడ: జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కొరకు సమాచార పౌర సంబంధాల శాఖ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఈ నెల 23వ తేదీ నుండి అందుబాటులో ఉంచనుందని, అక్రిడిటేషన్ కలిగిన జిల్లాకు చెందిన అర్హులైన జర్నలిస్టులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డిల్లీరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్‌టిటిపి://ఐపిఆర్.ఎపి.జిఒవి.ఇన్ వెబ్‌సైట్ ద్వారా వివరాలను 2024 జనవరి 6వ తేదీ వరకు నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయిన తర్వాత సంబంధిత అధికారులు పరిశీలించి అనంతరం జిల్లా కమిటీలు నిబంధనల మేరకు ఇళ్ల స్థలాలను కేటాయించడానికి సరైన స్థలాలను జిల్లా పరిధిలోనే గుర్తిస్తారని తెలిపారు.

మొదటిపేజీ తరువాయి

ప్రతిపాదనలకే పరిమితం

అవుతుందని అంచనా వేశారు. ఆ మేరకు ఇటీవల ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపారు. కానీ ప్రభుత్వ స్పందన కరువైంది. 14 ఏళ్ల క్రితం రూ.36 కోట్లతో పూర్తి కావలసిన ప్రాజెక్టు ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల రూ.62 కోట్లకు చేరుకుంది. అంటే రూ.26 కోట్లు అదనంగా వెచ్చించాల్సిన దుస్థితి నెలకొంది. మరో వైపు అంచనాలు రూపొందించడమే తమ పనిగా మారిపోయిందని అధికారులు సైతం పెదవి విరుస్తున్నారు.

కష్టాల్లో మిరప రైతు

కౌలు రైతుల పరిస్థితి వర్ణనాతీతం. అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టిన వారు.. ఎలా చెల్లించాలోనని మనోవేదనకు గురవుతున్నారు. ఈ సందర్భంగా కౌలు రైతు వెంకట్రావు మాట్లాడుతూ తాను ఏడు ఎకరాల్లో మిరప సాగు చేశానని, ఇప్పటి వరకు రూ.8 లక్షలు పెట్టుబడి పెట్టానని, తెగులు రావడంతో ఎండుముఖం పట్టిందని వాపోయాడు. ఎకరాకు ఒకటి రెండు క్వింటాళ్ల దిగుబడి రావడం కూడా కష్టమేనన్నారు. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని కోరారు. సాధారణంగా వర్షాలు అధికంగా ఉన్నప్పుడు తెగుళ్ల వ్యాప్తి ఎక్కువగా ఉంటుంది. ఇతర తెగుళ్లు అధికంగా వ్యాపించడంతో రైతులు దిగులు చెందుతున్నారు. ఈ ఏడాది తీవ్రంగా నష్టపోతామని ఆందోళన చెందుతున్నారు.

పరిశ్రమల ఏర్పాటుకు యువతను ప్రోత్సహించాలి

నాబార్డు డీడీఎం ఎం.చౌసాల్కర్, ఎల్‌డీఎం కె.ప్రియాంక, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.నాగమణెమ్మ, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి ఎం.రుక్మాంగదయ్య, పరిశ్రమల అధికారి సుధాకర్, ఉద్యాన అధికారి బాలాజీ కుమార్ పాల్గొన్నారు.

అడ్డదిడ్డంగా వాహనాల పార్కింగ్

- జాతీయ రహదారిపై పెరుగుతున్న ప్రమాదాలు
- పట్టించుకోని హైవే, పోలీసు అధికారులు

ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్

జాతీయ రహదారిపై వాహనాలను అడ్డదిడ్డంగా పార్కింగ్ చేస్తుండటంతో వాహనదారులు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని ప్రయాణం చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. జాతీయ రహదారిపై వాహనాలు అత్యంగా వేగంగా పరుగులు తీస్తుంటాయి. అంతే వేగంగ ప్రాణాలు కూడా పోతున్నాయి. మితిమీరిన వేగానికి తోడు జాతీయ రహదారి వెంబడి ఉన్న దుకాణదారులు నిబంధనలకు విరుద్ధంగా రాత్రి పగలు తేడా లేకుండా అంటుబాటులో ఉండటంతో ఎక్కడంటే అక్కడ వాహనాలు నిలిపివేస్తుండటంతో వెనక నుంచి వస్తున్న వాహనాలు ఢీకొంటున్నాయి. చెన్నై- కలకత్తా జాతీయ రహదారి విస్తరణ జరిగినా ఎ.సీతారామపురం నుంచి కలపర్రు వరకూ ప్రమాదాలు మాత్రం ఆగలేదు. నిత్యం ఎక్కడో ఒకచోట ప్రమాదం జరగడంతో రహదారి రక్తసిక్తమవుతోంది. రహదారి విస్తరణ జరిగి ఏళ్లు గడుస్తున్నా, ప్రమాదాల బారిన పడి పలువురు ప్రాణాలు కోల్పోతున్నా అధికారులు భద్రతా చర్యలు చేపట్టినట్లు కనిపించడం లేదు. బాపులపాడు మండలంలో 20 కిలోమీటర్లకు పైగా గల జాతీయ రహదారిపై గతంలోనే కొన్ని బ్లాక్ స్పాట్లు గుర్తించారు. రహదారి విస్తరణ జరిగిన తర్వాత బ్లాక్ స్పాట్లతో పాటు మెర్జింగ్ కూడళ్లు (సర్వీస్ రహదారి, జాతీయ రహదారి కలిసే చోటు) కూడా ప్రమాదకరంగా తయారయ్యాయి. రాత్రి పూట 11 గంటల తర్వాత లారీలతో పాటు భారీ వాహనాలు రహదారులపైనే ఆపడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి.

బొమ్ములూరు, ఎస్ఎన్‌పాలెం, వేలేరు అడ్డరోడ్డు, వీరవల్లి బైపాస్, అంపాపురం తదితర కూడళ్లలో మొబైల్ ఆల్పాహారశాలలు అనధికారికంగా ఏర్పాటు చేయడం, పలుచోట్ల దాబా హోటళ్లు ఉండటంతో పాటు విజయవాడలో ఏ కార్యక్రమం జరిగినా బొమ్ములూరు నుంచి ట్రాఫిక్ డైవర్షన్ చేయడంతో భారీ వాహనాలను జాతీయ రహదారిపైనే నిలిపేస్తున్నారు. గతంలో బొమ్ములూరు నుంచి ఎ.సీతారంపురం వరకు తొమ్మిది బ్లాక్ స్పాట్లను గుర్తించి డివైడర్లు, బ్లింకర్ల ఏర్పాటు చేయడంతో పాటు చల్లటినీళ్లతో ముఖం కడుక్కునేలా (వాష్ అండ్ గో) ఏర్పాట్లు పోలీసులు చేశారు. విస్తరణ తర్వాత అలాంటి జాగ్రత్తలేమీ తీసుకోవడంలేదని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బొమ్ములూరు వద్ద హనుమాన్‌జంక్షన్ వెళ్లేందుకు ఏర్పాటు చేసిన సర్వీస్ రహదారికి అడ్డంగా రాత్రిపూట లారీలు, భారీ వాహనాలు నిలపడంతో దారి కనబడక పెరికీడు వద్దకు వచ్చిన తర్వాత సర్వీస్ రోడ్డులోకి రావాల్సి వస్తోందని వాహనదారులు వాపోతున్నారు.



రాత్రి 11 గంటల తరువాత కూడా హైవేపై దుకాణాలు తెరిచే ఉంచడంతో ఎవరికి ఇష్టం వచ్చినట్లు వారు వాహనాలను నిలిపి విశ్రాంతి తీసుకోవడంతో రెప్పపాటులోనే ప్రమాదాలు జరుగుతున్నాయి. కలపర్రు వద్ద అంబులెన్స్, అత్యవసర వాహనం అందుబాటులో ఉన్నా సిబ్బంది మాత్రం అందుబాటులో ఉండటం లేదని స్థానికులు చెబుతున్నారు. ప్రమాదం జరిగితే స్థానిక హైవే మొబైల్ పోలీసులే క్షతగాత్రులను ప్రైవేటు అంబులెన్స్‌లో ఆసుపత్రులకు తరలిస్తున్నారంటే పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. జాతీయ రహదారిపై ఇష్టమొచ్చినట్లు వాహనాలు నిలిపితే ప్రస్తుత శీతాకాలంలో పొగమంచు కారణంగా మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశముందని, ఇప్పటికైనా హైవే, పోలీసు అధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

బెంజ్ సర్కిల్ వద్ద ట్రాఫిక్ పరిశీలన



ప్రజాశక్తి-విజయవాడ: విజయవాడలో ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోతున్న ట్రాఫిక్ సమస్య పరిష్కారదిశగా ఈస్ట్ జోన్ డిప్యూటి పోలీస్ కమిషనర్ విశాల్ గున్ని స్వయంగా బెంజ్ సర్కిల్ మరియు పరిసర ప్రాంతాలైన ప్రధాన కూడళ్ళను, బెంజ్ సర్కిల్, బందర్ రోడ్, ఏలూరు రోడ్, నేషనల్ హైవే పై సిగ్నల్స్ లను పరిశీలించి అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డిప్యూటి పోలీస్ కమీషనర్ విశాల్ గున్ని, మాట్లాడుతూ విజయవాడ నగరంలో ట్రాఫిక్ సమస్యలను ఎలా నివారించాలనే దాని పై ట్రాఫిక్ ను పరిశీలన కు బెంజ్ సర్కిల్, పరిసర ప్రాంతాలైన ప్రధాన కూడళ్ళను పరిశీలించినట్లు చెప్పారు. విజయవాడ అవుటర్ రింగ్ రోడ్డు ఇంకా పూర్తి కాలేదని, అవుటర్ రింగ్ రోడ్డు పూర్తి అయితే ట్రాఫిక్ సమస్య తగ్గుతుందన్నారు. ఎక్కువగా ట్రాఫిక్ సమస్య ఉన్న ప్రదేశాలను, రోడ్డు అక్రమణలను గుర్తించడం జరుగుతుందన్నారు. చిన్న చిన్న మార్పులు చేసి ఎలా ట్రాఫిక్ ను కొంత వరకు నిరోదించవచ్చో... క్షేత్ర స్థాయిలో పరిశీలించామన్నారు. అధికారులతో కలసి ట్రాఫిక్ సమస్యపై చర్చించి వారి సలహాలను తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రజలు మరియు వాహనదారులు కూడా సహకరించాలన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ లను తప్పకుండా పాటించాలన్నారు. పబ్లిక్, పోలీస్ ల ఇద్దరి సహకారంతోనే ట్రాఫిక్ సమస్య పరిష్కారం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏడిసిపి డి.ప్రసాద్, సెంట్రల్ ఏసిపి భాస్కరరావు, 2వ ట్రాఫిక్ ఏసిపి జె.వెంకటనారాయణ, సౌత్ ఏసిపి డా.బి.రవికిరణ్, ఇన్స్పెక్టర్లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ జిల్లా, నందిగామ గ్రామ కాపురస్థులు పావులూరి భాను కిరణ్ , తండ్రి విజయ్ కుమార్ చెందిన ఇంటర్మీడియట్ లాంగ్ మెమో ఒరిజినల్ సర్టిఫికెట్ పోయినవి. ఇంటి నుండి గాంధీ సెంటర్ కు జిరాక్స్ నిమిత్తం వెళ్లు చుండగా మార్గమధ్యలో సర్టిఫికెట్ పోయినవి. లాంగ్ మెమో నెం. SL No.W263692. సదరు సర్టిఫికెట్ దొరికిన వారు 9866370718 సెల్ నెం. కు ఫోన్ చేసి అందజేయగలరు. తగిన పారితోషికం ఇవ్వబడును.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE :: AT SATTENAPALLI
O.S. NO. 48 OF 2015

BETWEEN:-
Andhra Bank (UBI), Madhira Branch,
Rep. by its Branch Manager. ... Plaintiff
"AND"
Puchchakayala Venkata Ramana
and others ... Defendants

NOTICE

To
Puchchakayala Venkata Ramana
S/o. Narasimharao R/o Kambhampadu Vill
Vastavai Mandal, N.T.R Dist

The plaintiff herein had filed the above suit against you before this Hon'ble court for recovery of money, the above case is posted to 2-12-2023 for your appearance. for suit notice along with Interlocutory applications, That you are hereby require to be attend either in person or through an advocate on 2-12-2023 at 10.30A.M before this Hon'ble court. Otherwise the matter will be heard and decided ex-parte/as per procedure.

(By order of the Hon'ble court)
K.PANDU RANGA RAO
Advocate, Khammam.

దావాసమను
మహారాజశ్రీ తిరువూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టులో
ఓ.యస్. 247/2019

బిట్వీన్ :
శ్రీమతి చలువాది సత్యవాణి ... వాది
మరియు
శ్రీమతి అందే సునీత .... ప్రతివాది

ప్రతివాది : శ్రీమతి అందే సునీత, భర్త : బొమ్మదేవర నరేంద్ర, తండ్రి : వెంకటేశ్వరరావు, హిందువు, 43 సం॥లు, ఉద్యోగం, ఉయ్యూరు టౌన్, వుయ్యూరు మండలం, కృష్ణాజిల్లా, వుయ్యూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జివారి కోర్టు పరిధి.

పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీ యొక్క హాజరు నిమిత్తం పలుమార్లు కోర్టు ద్వారాయున్నూ, రిజష్టరు పోస్టు ద్వారాయున్నూ వాయిదాలు తెలియ పరుస్తూ సమనులు పంపిననూ, మీకు అమలు కానందున, ప్రత్యామ్నాయ మార్గము ద్వారా దావా సమను జారీ చేయవలసినదిగా కోరుతూ పిటీషన్ దాఖలు చేయగా కోర్టువారు మీ యొక్క హాజరు నిమిత్తం ప్రత్యామ్నాయ పద్ధతిలో అనగా పత్రికా ముఖంగా మీకు దావా సమను జారీ చేయవలసినదిగా ఉత్తర్వులు ఇచ్చియున్నారు.

కావున పై నెంబరు దావాలో మీ హాజరు నిమిత్తం తిరువూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టు ఎదుట ది. 08-12-2023వ తేదీన ఉదయం 10-30 గం.లకు వాయిదా వుండియున్నందున, సదరు తేదీన కోర్టువారి యెదుట మీరుగాని, మీ తరఫున న్యాయవాది గారి ద్వారా గానీ హాజరై అభ్యంతరములు తెలియజేసుకొన వలయును. లేనియెడల మీ పరోక్షమున సదరు దావా పర్యవసానం తీర్మానించ బడునని తెలియజేయడమైనది.

(కోర్టువారి అనుమతితో ప్రచురించడమైనది.)

తిరువూరు.
ది.22-11-2023 ఇట్లు
మోదుగుమూడి శ్రీనివాసరావు, ఎం.ఏ., బి.యల్.,
న్యాయవాది,
శాంతినగర్, తిరువూరు, ఎన్టీఆర్‌జిల్లా.
సెల్ : 98852 92197

మహారాజశ్రీ 7వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు విజయవాడ
O.S. NO.302 OF 2015

Between:
Bommareddy Lakshmi
- **Pettioner/ Plaintiff**
AND
M/s Anjali Drugs India Pvt. LTD
And Others - Defendants

Defendants:
5. BommaReddy Sushmitha,W/o. Late. Srinivasa Reddy, Hindu, Aged 42 Years, R/o. Bhadrrajupalem, 521163, Thotlavalluru Mandal, Krishna District.
6. Bommareddy Vamsi Naga Krishna Reddy, S/o. Late. Srinivasa Reddy, Hindu, Aged 13 Years, R/o. Bhadrrajupalem, 521163, Thotlavalluru Mandal, Krishna District.

పై నెంబరు దావా నందు వాది, ప్రతివాదుల పై, దావా దాఖలు చేసియున్నందున సదరు సమన్లు నిమిత్తం పైకోర్టు వారు ది.18-12-2023వ తేదీకి వాయిదా వేసినారు. కావున ది.18-12-2023వ తేదీన పైకోర్టు వారి ఎదుట ఉదయం గం.10.30. ని॥లకు స్వయంగా గాని , అడ్వకేటు ద్వారా గాని, హాజరై తమకు గల ఆక్షేపణలను తెలుపుకొనవలెను లేనిచో మీ పరోక్షమందు తీర్మానించెదరని యిందు మూలముగా తెలియచేయడమైనది.

వాయిదా ది: 18-12-2023

(BY ORDER OF COURT)
GVNNSN MURTHY,
K.Prakash Rao,
Advocate for Pettioner/ Plaintiff
Vijayawada. Cell:9849196029

మహారాజశ్రీ విజయవాడ 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో
O.S.No.196/2021

Between:
Dimmiti Srinu S/o Late Dimmiti Kutumba Rao, R/o Punadipadu Village, Kankipadu Mandal, Krishna District ...Plaintiff
And
Putti Dhanalakshmi
W/o Putti Madhusudhana Rao,
R/o H.No.61-10/1-6/2,
New House No.61-10/2-7, Nagendra Nagar Colony, Ramalingeswara Nagar,
Vijayawada ...Defendant

పై నంబరు దావా వాది మీపై దావా బాకీ రు.3,25,729/- మరియు ఖర్చులు వగైరాలు రాబట్టు కోనుటకు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకు యెట్టి అభ్యంతరములు ఉన్నయెడల తెలుపుకొనే నిమిత్తము ది.07-12-2023వ తేది ఉదయం గం॥ 10-30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయముగా గాని లేక న్యాయవాది గారి ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందు మూలముగా తెలిజయేయడమైనది

Vijayawada,
20-11-2023 ఇట్లు
Pallem Chitti Babu,
Smt:P.Satya Vani,
Advocates,
S.B.I Colony No.1, Road No.4,
Vijayawada-520010,
Cell No.9849279727.

గౌరవనీయ ఆంధ్రప్రదేశ్ స్టేట్ కన్సుమర్ డిస్పిట్యు రెడ్‌రెస్సాల్ కమీషన్, విజయవాడ
ఎఫ్.ఎ.నెంబరు 368 ఆఫ్ 2023

బిట్వీన్:
ది బ్రాంచ్ మేనేజర్, వజ్రాంకార చిట్ ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్, రిప్రజెంటెడ్ బై బ్రాంచ్‌మేనేజర్ చదలవాడ వెంకటేశ్వరరావు ...అప్పిలెంటు
మరియు
మెస్సర్స్ కె.ఎస్.ప్రొవైడర్స్, రిప్రజెంటెడ్ బై మేనేజింగ్ పార్టనర్ కొండవీటి శ్రీనివాసరావు మరియు ఒకరు ...రెస్పాండెంట్లు

టూ,
మొదటి ప్రతివాది: మెస్సర్స్ కె.ఎస్.ప్రొవైడర్స్, రిప్రజెంటెడ్ బై మేనేజింగ్ పార్టనర్ కొండవీటి శ్రీనివాసరావు, డోర్ నెంబరు 31-23-3, మెయిన్ రోడ్డు, మారుతీనగర్, విజయవాడ-520004

అప్పిలెంటు పైన పేర్కొన్న అప్పీలును పైన పేర్కొన్న కమీషన్‌లో ది.17-05-2023న సిసి నెంబరు 148 ఆఫ్ 2017లో డిస్ట్రిక్ట్ కన్సుమర్ డిస్పిట్యు రెడ్‌రెస్సాల్ కమీషన్-2, విజయవాడ వారు ఇచ్చిన ఆర్డర్‌ను రద్దు చేయమని దాఖలు చేసి యున్నారు. ఈ అప్పీలులో గౌరవనీయ ఎపి స్టేట్ కన్సుమన్ డిస్పిట్యు రెడ్‌రెసల్ కమీషన్, విజయవాడ వారు మీకు నోటీసు ఆర్డర్ వేసి, మీ హాజరు నిమిత్తం ది.22-12-2023కు అప్పీలు వాయిదా వేశారు. కనుక ది.22-12-2023 ఉదయం 10-30 గంటలకు మీరు స్వయంగా గానీ లేదా మీ లాయర్ గారు ద్వారా గానీ పైన పేర్కొన్న కమీషన్ ఎదుట హాజరు కావాల్సివుంది. ఒకవేళ మీరు హాజరు కాకపోతే మీ పరోక్షంలో అప్పీలు పరిష్కరించబడును.

(కమీషన్ ఆర్డర్ ప్రకారం)

వాయిదా:22-12-2023
టి.ఆంజనేయులు,
న్యాయవాది,
విజయవాడ

In The Court of The IIIrd Addl Junior Civil Judge, Vijayawada
O.S.No.196/2021 in IANo.69/2021

Between:
Dimmiti Srinu S/o Late Dimmiti Kutumba Rao, R/o Punadipadu Village, Kankipadu Mandal, Krishna District ...Petitioner
And
Putti Dhanalakshmi
W/o Putti Madhusudhana Rao,
R/o H.No.61-10/1-6/2,
New House No.61-10/2-7, Nagendra Nagar Colony, Ramalingeswara Nagar,
Vijayawada ...Respondant

పై నంబరు పిటిషన్‌లో రెస్పాండెంట్ యొక్క పిటిషన్ షెడ్యూలు దాఖలా స్థిరాస్తి పటమట, రామలింగేశ్వరనగర్, నాగేంద్రనగర్ కాలనీ, డోర్ నెం.61-10/2-7, పాత డోర్ నెం.61-10/1-6/2, Extant 173.5 Squar Yards అందులో నిర్మించబడిన డాబా దావా బాకీ క్రింద జప్తు చేయునిమిత్తము పై నంబరు పిటిషన్ దాఖలు చేసికొనియున్నాను. సదరు పిటిషన్‌లో రెస్పాండెంట్‌కు యెట్టి అభ్యంతరములు ఉన్నయెడల తెలుపుకొనే నిమిత్తము ది.07-12-2023వ తేది ఉదయం గం॥ 10-30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయముగా గాని లేక న్యాయవాది గారి ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందు మూలముగా తెలిజయేయడమైనది

Vijayawada,
20-11-2023 ఇట్లు
Pallem Chitti Babu,
Smt:P.Satya Vani,
Advocates,
S.B.I Colony No.1, Road No.4,
Vijayawada-520010,
Cell No.9849279727.

పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- 'ఆంధ్రప్రదేశ్‌కు జగనన్నే ఎందుకు కావాలి'లో వక్తలు


అవనిగడ్డలో...

ప్రజాశక్తి-పెదపారుపూడి : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సామాన్య మధ్యతరగతి వర్గ ప్రజల సంక్షేమం కోసం విశేష కృషి చేస్తున్నారని ఎంపీపీ గోగం సురేష్ అన్నారు. మోపర్రు గ్రామంలో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనన్నే ఎందుకు కావాలి' అనే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముందుగా గ్రామానికి జగనన్న ప్రభుత్వంలో అందిన సంక్షేమ వివరాలు గల బోర్డును ప్రారంభించి సమావేశంలో జగనన్న ప్రభుత్వం చేసిన మంచిని వివరించారు. అనంతరం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ బలహీన వర్గాల ప్రజల సంక్షేమం లక్ష్యంగా సీఎం జగన్మోహన్ పాలన అందిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయం కన్వీనర్ జాజుల చిన్నారి , వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మండలం అధ్యక్షుడు గోళ్ల సోమేశ్వరావు సచివాలయం కన్వీనర్స్, పలు గ్రామ సర్పంచులు కొమ్మ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-అవనిగడ్డ :** అవనిగడ్డ పంచాయతీ పరిధిలోని ఐదవ సచివాలయం ప్రాంతంలో ఏపీకి జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తొలుత ఐదవ సచివాలయం లోని లబ్ధిదారులకు లబ్ధి పొందిన బోర్డును ఎంపీపీ తుంగల సుమతి దేవి జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పేద ప్రజలకు అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల గురించి వీటిని ఆదర్శంగా తీసుకొని ఇతర రాష్ట్రాలు అమలు చేస్తున్నాయని తెలిపారు. అనంతరం గ్రామంలో ప్రధాన కూడలిలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఇంటింటికి తిరిగి గత తెలుగుదేశం ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు ఇప్పుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి మేనిఫెస్టో ఇచ్చిన హామీలను వాటి అమలు తీరును వివరిస్తూ కరపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల పార్టీ కన్వీనర్ రేపల్లి శ్రీనివాసరావు, మండల కోఆప్షన్ సభ్యులు షేక్ నజీర్ భాష, పార్టీ యూత్ కన్వీనర్ గాజుల జై గోపాల్ లంకమ్మ అమ్మవారి టెంపుల్ చైర్మన్ అన్నపురెడ్డి రామదాసు పాల్గొన్నారు. **ప్రజాశక్తి హనుమాన్‌జంక్షన్ :** రాబోయే ఎన్నికలలో రాష్ట్రంలో మరోసారి వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని ఎంపీపీ వై.నగేష్ పేర్కొన్నారు. బాపులపాడు మండలం వీరవల్లి గ్రామంలో రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో జడ్పిటిసి గంగభావాని, మండల అధ్యక్షుడు నక్క గాంధీ లతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కన్వీనర్లు సచివాలయం కన్వీనర్లు, మండల,గ్రామ నాయకులు వలంటీర్లు, గహసారథులు అందరూ కలిసికట్టుగా పనిచేసి రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి కలిసికట్టుగా పని చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ శేషగిరిరావు, గ్రామ కన్వీనర్ గూడవల్లి రత్న సుధాకర్, పిఎసిఎస్ అధ్యక్షురాలు అల్లాడి తెలుసా,కోడేబోయిన బాబి పాల్గొన్నారు.

అంగలూరులో 'పల్లెకు పోదాం'

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : పల్లెకుపోదాం కార్యక్రమంలో భాగంగా మండలంలోని అంగలూరు సచివాలయం వద్ద బుధవారం కార్యక్రమాన్ని నిర్వహించారు .సంక్షేమ అభివద్ధి పథకాల బోర్డు ఆవిష్కరించి వాటి గురించి పార్టీ నాయకులు ప్రజలకు వివరించారు. అనంతరం పార్టీ జెండా ఎగురవేశారు. ఉదయం గ్రామం లోని ప్రజల ఇంటింటికి వెళ్లి జగన్ మళ్ళీ ఎందుకు ముఖ్యమంత్రి కావాలి అని ప్రజల అభిప్రాయాలు సేకరించారు. జగన్ పథకాల పూర్తి అమలు విధానాలు అడిగి తెలుసుకున్నారు.. ఈ కార్యక్రమంలో గుడివాడ ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షులు పాలేటి చంటి, ఎంపీపీ కొడాలి సురేష్, వైస్ ఎంపీపీ సాయన రవికుమార్, గ్రామ సర్పంచ్ మేడేపల్లి రవికుమార్, ఉపసర్పంచ్ త్రిపురనేని సురేష్ పాల్గొన్నారు.

అభయాంజనేయునికి పూజలు

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్ : హనుమాన్ జంక్షన్ లో ఉన్న శ్రీ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో గురువారం స్వామివారి జన్మనక్షత్ర పూజలు వైభవంగా నిర్వహించారు. ఆలయ వెనుక భాగంలో స్వామివారి ఉత్సవ విగ్రహానికి ఆవుపాలతో అభిషేకం కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రతినెల అభయాంజనేయ స్వామి జన్మ నక్షత్రమైన పూర్వాభాద్ర నక్షత్రం సందర్భంగా అర్చన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. బుధవారం నిర్వహించిన పూజా కార్యక్రమాలలో పలువురు భక్తులు పాల్గొని స్వామివారికి ఆవుపాలతో అభిషేకం చేశారు. పూజా కార్యక్రమాలు ముగిసిన అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అర్చకులు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణ అధికారి కూచిపూడి శ్రీనివాస్, పాలకమండలి చైర్మన్ నెర్సు భూషణ,దాతలు విష్ణువర్ధన్, వరాహలక్ష్మీ దంపతులు, కారుమూరి సోమేశ్వరరావు దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణేశ్వరస్వామిని దర్శించుకున్న ఎస్ఐ

ప్రజాశక్తి-మోపిదేవి : మోపిదేవి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని బందరు తాలూకా పోలీస్ స్టేషన్ నుండి బదిలీపై మోపిదేవి పోలీస్ స్టేషన్ కు వచ్చిన ఎస్.ఐ కె. వీర వెంకట సత్యనారాయణ బుధవారం దర్శించుకున్నారు. వీరిని ఆలయ అధికారులు సిబ్బంది బర్మా ప్రసాద్ ఆలయ మర్యాదలతో సత్కరించారు.

నిత్యావసర వస్తువులు అందజేత

ప్రజాశక్తి-గుడివాడ : స్థానిక ధనియాల పేటలోని ప్రణవశ్రమంలో చింతా పాండు రంగారావు ట్రస్ట్ చే విద్యార్థులకు అవసరమైన సబ్బులు, టూత్ బ్రష్ లు, పేస్టులు, తువ్వాలను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ చింతా రామకష్ణ మాట్లాడుతూ సిపిఆర్ ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమం చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ ఇన్చార్జి వేణు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య తలెత్తితే కఠిన చర్యలు : సిఐ

ప్రజాశక్తి-వన్‌టౌన్ : రోడ్లపై ఆక్రమణలతో నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని వన్‌టౌన్ సిఐ సురేష్ రెడ్డి హెచ్చరికలు జారీ చేశారు. ఈ సందర్భంగా బుధవారం సిఐ సురేష్ రెడ్డి సిబ్బందితో కలిసి పాత శివాలయం వీధి, సామారంగం చౌక్, కాళేశ్వరరావు మార్కెట్ ప్రాంతాల్లో పర్యటించారు. సిఐ సురేష్ రెడ్డి, ఎస్సైలు రఘురాం, శంకర్రావు, రమ్యశ్రీ సత్య , సిబ్బంది పర్యటించి రోడ్డు మీదకు వచ్చినవారికి తగు హెచ్చరికలు జారీ చేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా సీఏ సురేష్ రెడ్డి బందం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని వాహన చోదకులు, స్థానికులు అభినందించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు : కమిషనర్

ప్రజాశక్తి-విజయవాడ : విజయవాడ నగరంలో ప్రమాదాల నివారణకు పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు. పోలీసు ఉన్నతాధికారులతో కమిషనర్ తన చాంబర్‌లో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ...నగరంలో జనం రద్దీగా ఉండే ప్రాంతాలను గుర్తించి, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరణ చేసి, ప్రమాదాల నివారణకు పోలీసు అధికారులు తీసుకోవాలని కోరార. రద్దీగా ఉన్న పలు ప్రాంతాలను గుర్తించి, ప్రయాణికుల సదుపాయం కోసం ట్రాఫిక్‌ని తగ్గించి ప్రమాదాలకు నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు.విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఎల్లప్పుడు రోడ్డు ప్రమాదాల నివారణకు ఎటువంటి చర్యలైన తీసుకోటానికి సిద్ధంగా ఉంటుందన్నారు. ప్రజల శ్రేయస్సు ప్రధానం అని, అందుకు అవసరమైన సహాయ



సహకారాలు, సదుపాయాలు ఏర్పాటు చేస్తుందన్నారు. ప్రజల రక్షణకు విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని కమిషనర్ అన్నారు.ఈ సమావేశంలో ఏ.డి.సి.పి (ట్రాఫిక్) ప్రసాద్, ఏసిపి (ట్రాఫిక్) వెంకటనారాయణ, ఏసీపీ (సౌత్) రవి కిరణ్, ఏసిపి (సెంట్రల్) భాస్కర్, కష్ణలంక సీఐ ఎంవీ దురా రావు, డిప్యూటీ సిటీ ప్లానెర్ జూబిన్ సిరన్‌రాయ్, పాల్గొన్నారు.

కబ్జాను అడ్డుకున్నందుకే ఆరోపణలు

- పారిశ్రామికవేత్త కోగంటి సత్యం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : తమ స్థలం ముందువున్న 33 అడుగుల రోడ్డు కబ్జా ప్రయత్నాలను తాను అడ్డుకున్నందుకే కబ్జా చేయడానికి ప్రయత్నించిన మహిళ తనపై అసత్య ఆరోపణలు చేస్తోందని ప్రముఖ పారిశ్రామికవేత్త కోగంటి సత్యనారాయణ (సత్యం) అన్నారు. స్థానిక 45వ డివిజన్‌లోని సితార సెంటర్ సమీపంలో ఓ స్థలం వివాదాల్లో తనను ఇన్వాల్వ్ చేయడం పట్ల సత్యం బుధవారం వివాదాస్పద స్థలం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన స్థలానికి సంబంధించిన వివరాలు వెల్లడించారు. దశాబ్దాల క్రితం తాము 1800 గజాల స్థలం కొనుగోలు చేశామని, చట్టపరమైన రిజిస్ట్రేషన్‌లు తదితర ఆధారాలు వున్నాయన్నారు. మేము ఎక్కడా కబ్జా చేసిందనేది లేదని, మీరు ఎక్కడైనా విచారించుకోవచ్చుని, మా వద్ద అన్ని




డాక్యుమెంట్స్ ఉన్నాయని సత్యం తెలిపారు. తనపై ఆరోపణలు చేసిన మహిళ తమ స్థలం ముందున్న రోడ్డును కబ్జా చేసి నిర్మాణం చేయడానికి వస్తే తాము స్పందనలో ఫిర్యాదుచేసామని పిర్యాదు నఖలు చూపించారు. తనపై ఆరోపణలు చేసిన ఆ మహిళే కబ్జా చేసి నిర్మాణం చేయడానికి వస్తే తాము స్పందనలో కూడా ఫిర్యాదు పెట్టామని పిర్యాదు నఖలు చూపించారు. రెవెన్యూ ఆఫీస్‌లో ఎమ్మార్వోకి ఇచ్చినట్లు తెలిపారు. కోర్టు స్టే ఇచ్చిందన్నారు.

చిరు వ్యాపారులపై అటవీశాఖాధికారుల దౌర్జన్యం

ప్రజాశక్తి-కోడూరు : అటవీ అధికారులు హంసలదీవి సాగరతీరం అభివద్ధికి మొదటి నుంచి మోకాలు అడ్డు వేస్తున్నారని పలువురు అంటున్నారు. సిఆర్జెడ్ నిబంధన పేరుతో తీరంలో ఏ విధమైన అభివద్ధి కార్యక్రమాలు జరగకుండా అటవీ అధికారులు అడుగడుగునా అడ్డంకులు కలిగిస్తున్నారన్నారు. తాజాగా బుధవారం అటవీ అధికారులు సాగర తీరంలో ఉపాధి కోసం చిరు వ్యాపారాలు సాగించే తోపుడుబండ్ల వారిపై తమ ప్రతాపాన్ని ప్రదర్శించారు. పాలకాయతిప్ప గ్రామానికి చెందిన కొంతమంది మత్స్యకారుల కుటుంబాలు తమ ఉపాధి కోసం సాగరతీరంలో మంచినీటి, బాటిళ్లు ఐస్క్రీములు విక్రయించుకుంటూ జీవన ఉపాధి పొందుతున్నారు. వీరంతా ఏళ్ల తరబడి తీరానికి వచ్చే పర్యాటకులతో మమేకమవుతూ ఇక్కడ పరిస్థితులను వారికి వివరిస్తూ ఆపద సమయంలో పర్యాటకులను అనేకమార్లు రక్షించిన ఘటనలు కూడా ఉన్నాయి. అటవీ అధికారులు తీరంలో లేకపోయినప్పటికీ వీరే పర్యాటకులకు సూచనలిస్తూ తమదైన శైలిలో యాత్రికులకు అండగా నిలుస్తున్నారు. బుధవారం అటవీ అధికారులు ఈ వ్యాపారులపై దౌర్జన్యం చేసి తోపుడుబళ్లను సైతం పక్కకు లాగేసి చిరు వ్యాపారులపై దురుసుగా వ్యవహరించిన ఘటన ప్రస్తుతం తీవ్ర చర్చి నియాంశంగా మారింది. ఏదో పొట్టకూటి కోసం వ్యాపారాలు చేసుకునే తమపై అటవీ అధికారులు మొదటి నుంచి ప్రతాపం చూపుతూనే ఉన్నారని చిరు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడిగా ఇక్కడే జీవనం పొందుతున్న తమపై అటవీ అధికారులు ఈ విధంగా వ్యవహరించడం ఎంతవరకు సమంజసమని, తమ మాట వినకపోతే కేసులు పెట్టి లోపల తోస్తామంటూ కూడా అటవీ అధికారులు బెదిరిస్తున్నారని చిరు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటవీ అధికారులు తీరు పైన పర్యాటకులతో పాటు పాలకాయతిప్ప గ్రామస్తులు సైతం తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు.



టిడిపితోనే రాష్ట్రానికి భవిష్యత్తు : యార్లగడ్డ


హనుమాన్‌జంక్షన్‌లో..

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్: చంద్రబాబుతోనే రాష్ట్ర భవిష్యత్తు సాధ్యమని గన్నవరం నియోజవర్గం టిడిపి ఇన్చార్జ్ యార్లగడ్డ వెంకట్రావు పేర్కొన్నారు .బాపులపాడు మండలం రంగన్నగూడెంలో గ్రామ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో ఆయన స్థానిక నాయకులతో కలిసి పాల్గొన్నారు. వచ్చే టీడీపీ ప్రభుత్వంలో చంద్ర బాబు ప్రకటించిన మేనిఫెస్టోలోని పథకాలతో ఒక్కొక్క ఇంటికి చేకూరే లబ్దితో కూడిన హామీ కరపత్రాలను పంచిపెట్టారు. జగన్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. గ్రామంలో గుండెకు సంబంధించిన తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న టిడిపి కార్యకర్తలు కైతేపల్లి రంగారావు, కొలుసు కష్ణ లకు ఒక్కొక్కరికి పదివేల రూపాయలు చొప్పున యార్లగడ్డ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ టీడీపీ నేత, ఆళ్ల వెంకట గోపాల కష్ణారావు, మండల టీడీపీ అధ్యక్షులు దయాల రాజేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పుట్టా సురేష్, గ్రామ సర్పంచ్ కసుకుర్తి రంగామణి పాల్గొన్నారు. **ప్రజాశక్తి-కంకిపాడు :** కంకిపాడులో బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం తుమ్మలపల్లి హరికష్ణ బుధవారం జరిగింది. ఈకార్యక్రమంలో గ్రామపార్టీ అధ్యక్షుడు చలువాది రాజ గురవయ్య, యూనిట్ ఇంచార్జ్ పులి శ్రీనివాసరావు, బూత్ కన్వీనర్ ఏనుగ జయప్రకద్ కొండా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలకు కీర్తి ఎంపిక



ప్రజాశక్తి - తిరువూరు : జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు మండలంలోని మునుకుళ్ళ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి సిరికొండ కీర్తి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యా యులు బివి.వీరభద్రరావు తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జిఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయిలో కబడ్డీ పోటీల్లో గెలుపొందిన కీర్తి జాతీయస్థాయి పోటీకి ఎంపికవటం తమకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో కీర్తిని ప్రధానో పాధ్యాయులతో వ్యాయామ ఉపాధ్యాయురాలు బి.వేణి కష్ణమ్మ, ఉపాధ్యాయలు, సిబ్బంది బుధవారం అభినందించారు.



రికార్డు పత్రం చూపుతున్న యాజమాన్యం

కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీకి ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : ఉత్తమ పనితీరును కనబరిచినందుకు గానూ కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీ ఖండాంతర ఖ్యాతిని సొంతం చేసుకుంది. బెస్ట్ పెర్ఫార్మెన్స్ యూనివర్శిటీగా ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం దక్కించుకుని 1500 జాతీయ స్థాయి విద్యాసంస్థల నడుమ తన సత్తా చాటిందని కెఎల్‌యు వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి.పార్థసారధి వర్మ తెలిపారు. తమ కెఎల్ యూనివర్శిటీ పేరును బుక్ ఆఫ్ ఆసియా రికార్డ్స్‌లో నమోదు చేయడంతో పాటు తమ అధ్యాపకులు అనేక మంది విద్యార్థులను నైపుణ్యంలో తీర్చిదిద్దడంలో విజయం సాధించడంతో ఉత్తమ అధ్యాపకులుగా జాతీయ స్థాయిలో 15 అవార్డులను సాధించారని అన్నారు. ఈ అవార్డులను గోవాలో జరిగిన జాతీయ సదస్సులో ఎఐసిటిఇ తమ అధ్యాపకులకు అందించినట్లు తెలిపారు. స్కిల్ డెవలెప్‌మెంట్ డీన్ డాక్టర్ ఎ.శ్రీనాథ్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో సుమారు 15 వందల విద్యా సంస్థలు తమతో పోటీ పడినప్పటికీ తాము విద్యార్థులకు అందించిన స్కిల్ డెవలెప్‌మెంట్‌తో అవార్డులను సాధించామన్నారు. ఈ అవార్డులతో పాటు దీంతో పాటు ఉత్తమ వైస్ ఛాన్సలర్‌గా డాక్టర్ జి.పార్థసారధి వర్మ, ఉత్తమ డీన్‌గా స్కిల్ డెవలెప్‌మెంట్ డీన్ డాక్టర్ ఎ.శ్రీనాథ్ ఎంపిక కావడం పట్ల వర్శిటీలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఈ కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి.పార్థసారధి వర్మ, స్కిల్ డెవలెప్‌మెంట్ డీన్ డాక్టర్ ఎ.శ్రీనాథ్, కోఆర్డినేటర్ డాక్టర్ వి.వరప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

స్కేటింగ్ పోటీల్లో సిద్ధార్థ విద్యార్థి ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థి

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : ఈనెల 13 నుండి 18వ తేదీ వరకు విశాఖపట్నంలో జరిగిన 35వ రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాలో రోలర్ స్కేటింగ్ పోటీలలో నగరంలోని శ్రీ సిద్ధార్థ మహిళా జూనియర్ కళాశాల విద్యార్థినరి ఎం.సుచిత్ర బంగారు పతకం సాధించిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.పద్మజ తెలిపారు. ఈ సందర్భంగా లబ్బీపేటలోని కళాశాల కాన్ఫరెన్స్‌హాల్‌లో ప్రతిభ కనపరచిన విద్యార్థిని బుధవారం ఉదయం అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పద్మజ మాట్లాడుతూ తమ కళాశాల విద్యతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే తమ విద్యార్థులు రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయి పోటీల్లో అద్భుత ప్రతిభ కనపరచి పతకాలు సాధిస్తున్నారని తెలిపారు. సుచిత్ర తమ కళాశాలలో సీనియర్ ఇంటర్ ఎంపిసి చదువుతుందని తెలిపారు. సుచిత బంగారు పతకం సాధించడంతో పాటు వచ్చేనెలలో జరుగనున్న జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీలకు అర్హత సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు, కళాశాల అధ్యాపకులు అభినందించారు.

ఇండియా ఎ, బి జట్ల ఘన విజయం



ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ : బీసీసీఐ (భారత క్రికెట్ నియంత్రణ మండలి) ఆధ్వర్యంలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఎసిఎ) పర్యవేక్షణలో అండర్ -19 క్వాడ్రాంగ్యులర్ వన్డే క్రికెట్ టోర్నీలో బుధవారం జరిగిన మ్యాచ్‌ల్లో ఇండియా - ఎ, ఇండియా - బి జట్లు ప్రత్యర్థి జట్లపై ఘన విజయం సాధించాయి. మూలపాడులోని డివిఆర్ గ్రౌండ్ నందు ఇండియా -ఎ వర్సెస్ ఇంగ్లాండ్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఇండియా - ఎ జట్టు ఏడు వికెట్ల ఆధిక్యతతో ఘన విజయం సాధించింది. ఈమ్యాచ్‌లో ఇండియా ఎ జట్టు టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంది. దీనితో తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ జట్టు 27.5 ఓవర్లలో 142 పరుగులకు అంతా అవుటయ్యారు. జట్టులోని ఓపెనింగ్ బ్యాట్స్‌మెన్ బెన్ మికెన్నీ 57 బంతుల్లో 56 పరుగులు చేశారు. అనంతరం ఇండియా - ఎ జట్టు 28.2 ఓవర్లలో మూడు వికెట్లు మాత్రమే కోల్పోయి విజయానికి అవసరమైన 145 పరుగులు చేసి విజయం సాధించింది. జట్టులోని దిగ్విజయ్ పాటిల్ 74 బంతుల్లో 57 పరుగులు చేశాడు.

ఇండియా బి జట్టు విజయం...

మూలపాడులోని సిపి గ్రౌండ్స్ నందు బంగ్లాదేశ్ వర్సెస్ ఇండియా - బి జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఏడు వికెట్ల ఆధిక్యతతో ఇండియా బి జట్టు విజయం సాధించింది. ఈమ్యాచ్‌లో ఇండియా బి జట్టు టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ జట్టు 23.1 ఓవర్లలో 116 పరుగులకు అంతా అవుటయ్యారు. జటుట్లఓని మహ్మాద్ రెహమాన్ 39 బంతుల్లో 27 పరుగులు, మహ్మాద్ జేమ్స్ 24 బంతుల్లో 22 పరుగులు చేశారు. ఇండియా బి బౌలర్లు నిషాంత్ నాలుగు వికెట్లు, దనుష్ ఐదు వికెట్లు తీసుకున్నారు. అనంతరం ఇండియా - బి జట్టు 15.3 ఓవర్లలో 120 పరుగులు చేసి విజయం సాధించింది. జట్టులోని ఓపెనింగ్ బ్యాట్స్‌మెన్ రుద్ర మయూర్ పాటిల్ 54 బంతుల్లో 89 పరుగులు చేశారు.

పోస్టల్ ఉద్యోగుల టేబుల్ టెన్నిస్ పోటీలు ప్రారంభం



టేబుల్ టెన్నిస్ ఆడుతున్న ఉద్యోగులు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : పటమటలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో 39వ ఆలిండియా పోస్టర్ టేబుల్ టెన్నిస్ పోటీలు బుధవారం ఉదయం ఉత్సాహభరితంగా ప్రారంభమయ్యాయి. పోటీలను ఆంధ్రప్రదేశ్ సర్కిల్ చీఫ్ పోస్టు మాస్టర్ జనరల్ కల్నల్ వి.రాములు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులలో ఒత్తిడి తగ్గించి ఉల్లాసంగా ఉండేందుకు క్రీడా పోటీలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. ఇటువంటి పోటీలు పోస్టర్ ఉద్యోగులకు ప్రతి ఏటా నిర్వహిస్తున్నామని తెలిపారు. విజయవాడ పోస్టు మాస్టర్ జనరల్ డిఎస్‌విఆర్ మూర్తి మాట్లాడుతూ టేబుల్ టెన్నిస్ పోటీలు విజయవాడ నగరంలో నిర్వహించడం మంచి పరిణామమని అన్నారు. పోటీలు ఈనెల 26వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. పురుషులు, మహిళలు సింగిల్స్, డబుల్స్, వెటరన్ విభాగాల్లో ఈటోర్నమెంట్‌ను నిర్వహించ నున్నారని తెలిపారు. ఈపోటీలకు దేశ వ్యాప్తంగా అస్సాం, ఆంధ్రప్రదేశ్, చత్తీస్‌ఘడ్, గుజరాత్, హర్యానా, హిమాచల్ ప్రదేశ్, జార్ఖండ్, పంజాబ్, మధ్యప్రదేశ్, రాజస్తాన్, తమిళనాడు, తెలంగాణ, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ నుండి 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారని తెలపిఆరు. వీటితో పాటు ప్రతి ఏటా క్రికెట్ , క్యారమ్స్, కబడ్డీ, చెస్, బ్యాడ్మింటన్, వాలీబాల్, బాస్కెట్‌భాల్, హాకీ క్రీడల్లో కూడా ఉద్యోగులకు పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు.

ఘాట్ రోడ్డు వైపు మెట్లు నిర్మించాలి

జనసేన నాయకులు గయాజుద్దీన్‌కు స్థానికుల విన్నపం




సమస్యను చూపుతున్న గాయాజుద్దీన్

ప్రజాశక్తి - వన్‌టౌన్ : స్థానిక 40వ డివిజన్ భవానీపురం బాల భాస్కర్ నగర్ రెండో వీధి కట్ట నుంచి పున్నమి ఘాట్ రోడ్డు వైపునకు వెళ్లేందుకు మెట్లు లేక చాలా ఇబ్బందులు పడుతున్నామని, మెట్లు నిర్మించేందుకు సహకారం అందించాలని జనసేన మైనార్టీ నాయకులు, నగర అధికార ప్రతినిధి షేక్ గయాజుద్దీన్ (ఐజా)కు అక్కడి స్థానిక ప్రజలు విన్నవించారు. బుధవారం మధ్యాహ్నం స్థానికుల విజ్ఞప్తి మేరకు గయాజుద్దీన్ ఆ ప్రాంతంలో పర్యటించారు. గతంలో కట్టమీద నుంచి మెట్లు ఉండేవని రెండేళ్ల క్రితం తొలగించడంతో మహిళలు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారని వారు గయాజుద్దీన్ దష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యపై చాలాసార్లు స్థానిక కార్పొరేటర్ ఆంజనేయరెడ్డిని, సచివాలయ అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. పైగా మీరు గత కార్పొరేషన్ ఎన్నికలలో జనసేనకు ఓట్లు వేశారని చెబుతూ, ఆ వంకతో తమకు మెట్లు నిర్మించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గయాజుద్దీన్ మాట్లాడుతూ ఈ సమస్యను అధికారుల దష్టికి తీసుకెళ్తానని చెప్పారు. అయినా అధికారులు స్పందించకపోతే తన సొంత ఖర్చుతో నైనా సరే మెట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానని వారికి హామీ ఇచ్చారు. బాల భాస్కర్ నగర్ రెండో రోడ్డులో సిమెంటు రోడ్డు, సైడు కాలువలు వేస్తున్నారని, కాలవల కింద ఉన్న మంచి నీటి లోకి మురుగునీరు కలవకుండా జాగ్రత్తలకు తీసుకోవాలన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు చిల్లకల్లు విద్యార్థులు

జగ్గయ్యపేట: 23 నుండి కర్నూల్‌లో 67వ రాష్ట్రస్థాయి పాఠశాల గేమ్స్, లీగ్ లిఫ్టింగ్ పోటీలకు ఉమ్మడి కృష్ణాజిల్లా తరపున మండలంలోని చిల్లకల్లు జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు 15 మంది ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.వెంకటేశ్వరరావు తెలిపారు. అందరూ 17 విభాగంలో 12 మంది, 2019 ఈ భాగంలో ఇద్దరు ఎంపికైనట్లు తెలిపారు. వీరి కోచ్, పాఠశాల పిడి గంటా వెంకటేశ్వరరావును ప్రధాన ఉపాధ్యాయులు వి.వెంకటేశ్వరరావు అభినందించారు. ఎంపికైన విద్యార్థులు కర్నూలు బయలుదేరి వెళ్లారు.

విజయవాడలో మంగళవారం టీమ్



మంగళవారం చిత్ర బృందం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : నగరంలో మంగళవారం చిత్ర బందం సందడి చేసింది. ఈ చిత్రం గ్రామీణ వాతావరణంలో సాగే క్రైమ్ థ్రిల్లర్ మూవీ అని, చిత్రంలో అసభ్యకర సన్నివేశాలు ఏమీ లేవనీ ప్రముఖ నటి, ఆ చిత్ర కథానాయకురాలు పాయల్ రాజ్ పుత్ తెలిపారు. కుటుంబ సమేతంగా చూడదగిన చిత్రమని... మంగళవారం-2 కూడా త్వరలో సెట్స్ మీదకి రానుందనీ అమె చెప్పారు. మంగళవారం చిత్రం విజయోత్సవంలో భాగంగా విజయవాడలోని ప్రముఖ హోటల్లో చిత్ర బందం సందడి చేసింది. ఈ సందర్భంగా పాయల్ రాజ్‌పుత్ మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ చిత్రంలో నటించడం చాలా సంతోషంగా ఉందన్నారు. చిత్రాన్ని ఎంతో ఛాలెంజింగ్‌గా తీస్కుని నటించాననీ అన్నారు. డైరెక్టర్ ఈ కథ గురించి చెప్పినప్పుడు శైలజ పాత్రలో నటించడానికి ఆలోచించాననీ... ఈ పాత్ర చేయడానికి చాలా గట్స్ కావాలని అన్నారు. ఈ చిత్రంలో తన క్యారెక్టర్ చేయడానికి మొదట తన తల్లి అనుమతించిందనీ... తాను చాలా సంతోషపడ్డాననీ చెప్పారు. గ్రామీణ వాతావరణంలో సాగే క్రైమ్ థ్రిల్లర్ మూవీ అని పేర్కొన్నారు. మహిళా ప్రేక్షకుల నుండి విశేష స్పందన రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. చిత్రంలో అసభ్యకర సన్నివేశాలు లేవన్నారు. అనంతరంఅనంతరం డైరెక్టర్ అజయ్ భూపతి మాట్లాడుతూ.....ఆర్ఎక్స్ 100 తర్వాత అంతటి ఘనవిజయం ఈ చిత్రానికి లభించిందన్నారు. విలేకరుల సమావేశంలో చిత్ర హీరో శరవన్ రెడ్డి, నటుడు శ్రీ తేజ్, కమెడియన్ లక్ష్మణ్, నిర్మాత సురేష్ వర్మ పాల్గొన్నారు.

ఆర్టిఫిషియల్ ఇంటలెజెన్స్‌తో అన్ని రంగాలు పరిపుష్టం

-ఏపి ఉన్నత విద్యామండలి ఉపాధ్యక్షులు రామమోహనరావు



మాట్లాడుతున్న కె.రామమోహనరావు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో అన్ని రంగాలు పరిపుష్టం కానున్నాయని ఏపీ ఉన్నత విద్యామండలి ఉపాధ్యక్షులు ఆచార్య కె.రామమోహనరావు అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో రసాయనశాస్త్రంలో ఆర్టిఫిషియల్ ఇంటలెజెన్స్ పాత్ర, ప్రస్తుత ప్రగతి, రానున్న పరిస్థితులు' అంశంపై జాతీయ సదస్సును బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన ప్రారంభ సభకు ఆచార్య కె.రామమోహనరావు ముఖ్యఅతిథిగా పాల్గొని సదస్సును ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కంప్యూటర్స్‌తో అనుసంధానం కాని రంగం ఈ ప్రపంచంలో ఏదీ లేదన్నారు. ప్రపంచంలో అన్ని రంగాల్లో కంప్యూటర్స్ ప్రగతిపథంలో దూసుకు పోతున్నాయన్నారు. కృష్ణా విశ్వవిద్యాలయం రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ డి.రామశేఖరరెడ్డి మాట్లాడుతూ రసాయనశాస్త్రంలోనూ దాని వినియోగం ఇటీవలే ప్రారంభమైందన్నారు.సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ రసాయనశాస్త్రంలో ఆర్టిఫిషియల్ ఇంటలెజెన్స్ నూతన అంశంపై మరింత లోతైన చర్చ జరగాలన్నారు. ఈ సందర్భంగా సదస్సులో అధ్యయన పత్రాల సంచికను అతిథుల చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం రీసెర్చ్ విభాగ డీన్ ఆచార్యఈ రంజిత్ తాపా, కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇంటస్ట్రియల్ రీసెర్చ్ (హైదరాబాద్) శాస్త్రవేత్త డాక్టర్ సురేందర్‌సింగ్, పాల్గొన్నారు.